సంపుటి : 9
సంచిక : 357
శనివారం
19 సెప్టెంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వ వాయిస్

10 YEARS CELERRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999

### విజయసాయి రెడ్డి
## నీతులు చెప్పడమా?

**చిత్తశుద్ధి ఉంటే జగన్‌పై అప్రూవర్‌గా మారాలి : వర్ల రామయ్య**



**మంగళగిరి, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** జగన్ అవినీతి కేసుల్లో ఏ-2 నిందితుడిగా ఉన్న విజయ సాయి రెడ్డి 'అవినీతి రహిత పాలన', 'మూడో ప్రత్యామ్నాయం' అంటూ నీతులు చెప్పడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని టీడీపీ ఎమ్మెల్సీ వర్ల రామయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రూ.43 వేల కోట్ల ప్రజాధనం లూటీ కేసుల్లో జగన్‌తో పాటు సహ నింది తుడిగా ఉన్న వ్యక్తి, ఇప్పుడు జగన్ అవినీతిని పరోక్షంగా తప్పుబడుతున్నా రని, ఆయనకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే సీబీఐ కేసుల్లో 'అప్రూవర్'గా మారి జగన్‌కు శిక్ష పడేలా చేయాలని సూటి సవాల్ విసిరారు. శుక్రవారం మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వర్ల రామయ్య మాట్లాడుతూ విజయసాయి రెడ్డి తీరుపై మిగతా .. 2లో..

### పోర్ట్ ఇన్‌ఫ్రా ఎకో సిస్టమ్‌గా
# ఆంధ్రప్రదేశ్

- రాష్ట్రంలో హార్డ్‌వేర్ తయారీ హబ్ ఏర్పాటుపై దృష్టి
- రూ.22,177.84 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం
- 28 ప్రాజెక్టులతో 19,739 మందికి ఉద్యోగాల కల్పన
- జిల్లాల ఎగుమతుల ర్యాంకింగ్‌లో దేశంలోనే 10వ స్థానంలో తిరుపతి
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 21వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు



**అమరావతి, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను కీలకమైన హార్డ్‌వేర్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు... తీర ప్రాంతం పొడవునా పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసేలా చూడాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 21వ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశమైంది. మొత్తం 28 పారిశ్రామిక ప్రతిపాదనలకు సంబంధించి రూ.22,177.84 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 19,739 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఇంధన రంగం, ఐటీ కమ్యూనికేషన్, ఫుడ్ ప్రాసెసింగ్, తయారీ, పర్యాటక రంగాలకు చెందిన వివిధ ప్రతిపాదనలపై చర్చించి ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఏపీని దేశంలోనే ప్రముఖ హార్డ్‌వేర్ తయారీ రాష్ట్రంగా అభివృద్ధి చేయాలని సమావేశంలో సీఎం స్పష్టం చేశారు. సెమీ కండక్టర్లు, చిప్ తయారీ, రోబోటిక్స్ తదితర ఆధునిక సాంకేతిక రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి వంటి ఎలక్ట్రానిక్స్ హబ్‌లలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కేవలం ఎలక్ట్రానిక్స్ తయారీతో ఆగకుండా పరిశోధన, డిజైన్ల రూపకల్పన మాన్యుఫ్యాక్చరింగ్‌తో పూర్తి స్థాయి ఎకోసిస్టమ్ ఏర్పాటు చేయాలని అన్నారు. సోలార్ ప్యానళ్ల తయారీతో పాటు వాటికి అవసరమైన అనుబంధ పరిశ్రమలు, సాంకేతికత, నైపుణ్యాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాల న్నారు. క్వాంటమ్ టెక్నాలజీ, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ వంటి అత్యాధునిక మిగతా .. 2లో..

### నౌకను ఢీకొట్టి
## మాపైనే నిందలా?

**పాక్ తీరుపై మండిపడ్డ భారత్**



**సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** అరేబియా సముద్రం అంతర్జాతీయ జలాల్లో భారత్-పాక్ యుద్ధ నౌకలు ఢీకొన్న ఘటనలో పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్ ప్రత్యేక ఆర్థిక మండలిలో భారత నౌక రెచ్చగొట్టే, ఆమోదయోగ్యం కాని చర్యలకు పాల్పడిందని ఆ దేశ విదేశాంగశాఖ చేసిన ఆరోపణలు అసంబద్ధమైనవని స్పష్టం చేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. దాయాది దేశం తీరుపై మిగతా .. 2లో..

### వైకాపా నేత అంబటి రాంబాబుకు
## ఈడీ నోటీసులు



**గుంటూరు, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి అధికారులు మిగతా .. 2లో..

### జనవరిలో తెనాలి వేదికగా
## నంది నాటకోత్సవాలు

**రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్**



**అమరావతి, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు నాటకరంగానికి, సంస్కృతికి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నంది నాటకోత్సవాలను పునఃప్రారంభిస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో ఏర్పాటు చేసిన మీడియా మిగతా .. 2లో..

### ప్రతిభా కేంద్రాలుగా ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు..
## ఏఐ స్కిల్స్ తప్పనిసరి

- నిమ్మకూరులో ఐఐటీ-జేఈఈ/నీట్ అకాడమీ ఏర్పాటుకు ఆమోదం : నారా లోకేశ్ ఆదేశాలు
- 10 రెసిడెన్షియల్ స్కూళ్లను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయం
- విద్యార్థులకు ఏఐ స్కిల్స్‌తో పాటు కంప్యూటర్ ల్యాబ్స్ తప్పనిసరి
- సిబ్బంది పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం



**ఉండవల్లి, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలను (ఏపీఆర్ఎస్) ప్రతిభావంతులను తయారుచేసే అత్యుత్తమ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలను నెలకొల్పాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం ఆయన అధ్యక్షతన ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ 59వ గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రెసిడెన్షియల్ మిగతా .. 2లో..

### కడప జిల్లాకు కేంద్రం గుడ్ న్యూస్..
## రూ.304 కోట్లతో కొత్త హైవే



**కడప, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ కడప జిల్లా పారిశ్రామిక ప్రగతికి కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక ప్రాంతాన్ని కడప బైపాస్‌కు అనుసంధానించేలా 4-లేన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి రూ.304.44 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా వివరాలను వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 5.8 కిలోమీటర్ల పొడవున 'యాక్సెస్ కంట్రోల్డ్ హైవే'ను నిర్మించనున్నారు. ఇందులో ఒక ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్, రెండు భారీ వంతెనలు, నాలుగు వెహిక్యులర్ అండర్‌పాస్‌లను ఏర్పాటు మిగతా .. 2లో..

## దానంపై అనర్హత వేటు

**2024 ఏప్రిల్ 23 నుంచి వర్తింపు - శాసనసభ స్థానం ఖాళీగా పరిగణించాలి**
**స్పీకర్ నిర్ణయాలు న్యాయసమీక్షకు అతీతం కాదు - అనర్హత పిటిషన్‌లపై స్పీకర్ తీర్పు రద్దు**
**భారాస, భాజపా పిటిషన్‌లను అనుమతిస్తూ హైకోర్టు తీర్పు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** భారాస తరఫున ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎన్నికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం నాగేందర్‌పై హైకోర్టు శుక్రవారం అనర్హత వేటు వేసింది. 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హత అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది. ఆయనపై దాఖలైన అనర్హత పిటిషన్‌లను కొట్టివేస్తూ స్పీకర్ వెలువరించిన తీర్పులను మిగతా .. 2లో..

### పోలవరంలో మీ తప్పిదాలను
## మాపై రుద్దుతారేం జగన్?

**జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజం**



**అమరావతి, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ దుష్ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. వైకాపా హయాంలోనే ప్రాజెక్టును రెండు దశలుగా మార్చి ం41.15 మీటర్ల ఎత్తుకు నిధులు ఇవ్వాలని కోరింది జగనేనని అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మిగతా .. 2లో..

## పుట్టిన బిడ్డకు బంగారు ఉంగరం.. 28న ప్రారంభం



**చెన్నై, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మరో హామీని నెరవేర్చేందుకు సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించిన ప్రతి చిన్నారికీ ఒక గ్రాము బంగారు ఉంగరం ఇచ్చే పథకాన్ని ఈ నెల 28 నుంచి ప్రారంభించబోతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. 'మేనమామ బంగారు ఉంగరం' పేరుతో ఈ పథకాన్ని సీఎం విజయ్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. జూన్ 22 నుంచి పుట్టిన ప్రతి చిన్నారికీ ఈ పథకాన్ని మిగతా .. 2లో..




## టీటీడీ నెయ్యి కల్తీ కేసులో మరో కీలక అరెస్ట్

**సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లాను అదుపులోకి తీసుకున్న ఈడీ**
**రూ. 230 కోట్ల మేర కల్తీ నెయ్యి సరఫరా చేసినట్టు గుర్తింపు**
**పామాయిల్, రసాయనాలతో నెయ్యి తయారు చేసి మోసం చేసినట్టు ఆరోపణ**
**ఇప్పటికే ఇదే కేసులో ప్రధాన నిందితుడు విపిన్ జైన్ అరెస్ట్**



**తిరుపతి, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నెయ్యి కల్తీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కేసుతో సంబంధం ఉన్న సుకృతి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లాను హైదరాబాద్ ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఆయనను అదుపులోకి తీసుకున్న అధికారులు, అనంతరం విశాఖపట్నంలోని పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టులో మిగతా .. 2లో..

### బెంగాల్ ఉప ఎన్నికల వేళ..
## మమతకు షాక్



**సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమ బెంగాల్‌లో ఉప ఎన్నికల వేళ మాజీ సీఎం మమతా బెనర్జీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రెండు స్థానాల్లో ఉప ఎన్నికకు ఇంకా నెల రోజుల సమయం ఉండగా.. మమత వర్గానికి చెందిన టీఎంసీ అభ్యర్థి సంచితా ప్రధాన్ నందిగ్రామ్ ఉప ఎన్నిక బరి నుంచి తప్పుకొన్నారు. ఈ మేరకు ఆమె తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. బెంగాల్ సీఎం సువేందు అధికారితో సమావేశమైన అనంతరం పోటీ నుంచి వైదొలుగుతున్నట్లు సంచిత ప్రకటించడం గమనార్హం.

**నందిగ్రామ్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు:** దీదీ ప్రకటన తన వర్గానికి చెందిన టీఎంసీ అభ్యర్థి మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# పోర్టు ఇన్‌ఫ్రా ఎకో సిస్టమ్‌గా ఆంధ్రప్రదేశ్

రంగాల్లో పరిశోధన, తయారీ సంస్థలు వేగంగా ఏర్పాటయ్యేలా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. డ్రోన్, స్పేస్ సిటీల సమీపంలో ఆయా రంగాలకు అనుబంధంగా ఉండే క్లస్టర్ పరిశ్రమలు ఏర్పడేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సీఎం చెప్పారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ తయారీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసేందుకు తైవాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా తెలిపారు. పెట్టుబడులకు ఆమోదం తెలిపిన తర్వాత ప్రాజెక్టులు కేవలం త్వరితగతిన ఉత్పత్తి ప్రారంభించేలా పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ప్రతి ప్రాజెక్టుకు 6 నెలల గడువు విధించి, ఆ వ్యవధిలోగా పనులు ప్రారంభమయ్యేలా చూడాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని పోర్టుల వద్ద ఉన్న భూమిని వాణిజ్యపరంగా సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు. పోర్టుల అభివృద్ధితో పాటు వాటి చుట్టూ లాజిస్టిక్స్, షిప్ బిల్డింగ్, గోదాములు, తయారీ పరిశ్రమలు, అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఫిషింగ్ హార్బర్లను కూడా అభివృద్ధి చేయాలన్నారు. కార్గో షిప్‌ల నిర్మాణంతో పాటు డిఫెన్స్, టూరిజం అవసరాలకు అనుగుణంగా షిప్‌బిల్డింగ్ కార్యకలాపాలను రాష్ట్రంలో అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు.

**లాజిస్టిక్స్ హబ్‌గా ఏపీ**

పోర్టులు-షిప్‌బిల్డింగ్-లాజిస్టిక్స్-పరిశ్రమలను అనుసంధానించే సమగ్ర ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. లాజిస్టిక్స్ రంగంపై విస్తృతంగా పనిచేయాలని సీఎం అధికారులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌ను లాజిస్టిక్స్ హబ్‌గా అభివృద్ధి చేయాలని అన్నారు. పోర్టులు, రైలు, రోడ్డు, ఎయిర్ కార్గో, అంతర్గత జల రవాణా వంటి అన్ని రవాణా మార్గాలను అనుసంధానం చేసి సమగ్ర లాజిస్టిక్స్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. శ్రీసిటీ తో తిరుపతి జిల్లా ఎగుమతుల్లో దేశంలోనే 10వ స్థానంలో నిలిచిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా 12 స్థానంలో ఉందని ఎగుమతుల్లో టాప్-5లోకి తీసుకురావాలని సీఎం సూచించారు. రాష్ట్ర యువత నైపుణ్యాల్లో అగ్రస్థానంలో ఉండాలని సీఎం అన్నారు. 10వ తరగతి నుంచే స్కిల్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించాలని సూచించారు. దీనిపై స్కిల్ మ్యాపింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పీఎం సేతును కూడా అనుసంధానం చేసుకుంటూ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. విశాఖపట్నంలోని అదానీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నైపుణ్య శిక్షణతో పాటు సివిల్ ఏవియేషన్ సహా ఎంఆర్వో ఫెసిలిటీని కూడా అభివృద్ధి చేస్తున్న విషయాన్ని సమావేశంలో ప్రస్తావించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించేందుకు ఇలాంటి అవకాశాలను విస్తరించాలని సూచించారు. మెటీరియల్ రీసెర్చ్‌లో కూడా అత్యంత కీలకంగా నైపుణ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. భవిష్యత్ తయారీ పరిశ్రమలకు అవసరమైన పరిశోధన, సాంకేతిక నైపుణ్యాలు, మానవ వనరులను అభివృద్ధి చేయాలని సూచించారు. సిమెంట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు కొన్ని సిమెంట్ కంపెనీలు ముందుకు వచ్చినట్లు సమావేశంలో అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో మహిళా పారిశ్రామికవేత్తలకు ఉన్న అవకాశాలు, ప్రస్తుతం వారు నిర్వహిస్తున్న వ్యాపారాలు, ఎదుర్కొంటున్న సవాళ్లు, ఇతర రాష్ట్రాల్లో అమలు అవుతున్న విధానాలను పరిశీలించి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అగ్రి-బేస్డ్ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో కూడా మహిళలు మరింతగా పరిశ్రమలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని సీఎం అన్నారు. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలు విస్తృతమయ్యేలా 'వన్ ఫ్యామిలీ--వన్ ఎంట్రప్రెన్యూర్' విధానాన్ని ప్రోత్సహించాలని సీఎం సూచించారు.

**రేర్ ఎర్త్ మినరల్స్ పై ప్రత్యేక దృష్టి**

రేర్ ఎర్త్ మినరల్స్ విషయంలో ఆంధ్రప్రదేశ్‌ను హబ్‌గా తయారు చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని అన్నారు. రేర్ ఎర్త్ మినరల్స్ ఆధారిత ప్రాసెసింగ్, విలువ ఆధారిత పరిశ్రమలు, పరిశోధన, తయారీ రంగాలను అనుసంధానం చేసే దిశగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. టీటీడీ పరిధిలోని భవనాలపై సౌర, పవన విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వంటి ప్రత్యామ్నాయాల వైపు మళ్లాలని సూచించారు. టీటీడీలో నెట్‌జీరో లక్ష్యాన్ని సాధించే దిశగా చర్యలు చేపట్టాలని, ఎలక్ట్రిక్ బస్సులు, చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 511 చార్జింగ్ స్టేషన్లకు అనుమతులు ఇచ్చినట్లు సమావేశంలో వెల్లడించారు. ఆన్‌షోర్ విండ్ మిల్స్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవకాశాలను కూడా పరిశీలించాలని సీఎం సూచించారు. గ్రీన్ ఎనర్జీలో రాష్ట్రం నిర్దేశించుకున్న 160 గిగావాట్ల లక్ష్యానికి గాను ఇప్పటికే 113,75 గిగావాట్లకు సంబంధించి పెట్టుబడులు సాధించినట్టు అధికారులు వివరించారు. డిసెంబర్ 17, 18 తేదీల్లో ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో హైడ్రోజన్ వ్యాలీ సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నవంబర్‌లో జరిగే భాగస్వామ్య సదస్సు సందర్భంగా పెట్టుబడిదారులకు అందించే ప్రోత్సాహకాల కోసం ఎస్క్రో ఖాతాల ఏర్పాటుపై చర్యలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఆతిథ్య రంగంలో హోటళ్లు పెద్దఎత్తున ఏర్పాటయ్యేలా చూడాలని సీఎం సూచించారు. ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్ సంస్థలు వచ్చేలా ఆహ్వానించాలన్నారు. విశాఖలో భాగస్వామ్య సదస్సుకు మరో 50 రోజులు సమయమే ఉందని... అప్పటికల్లా గతంలో కుదిరిన ఒప్పందాలు గ్రౌండ్ అయ్యేలా చూడాలన్నారు. ఇప్పటివరకు జరిగిన 21 ఎస్ఐపీబీ సమావేశాల్లో మొత్తం 387 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా రూ.14.05 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.79 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉంది. ఎస్ఐపీబీ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, పి.నారాయణ, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్ రెడ్డి, సీఎస్ సాయి ప్రసాద్‌తో పాటు పరిశ్రమలు, ఐటీ, ఐ అండ్ ఐ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**21వ ఎస్ఐపీబీ సమావేశం ఆమోదం తెలిపిన 28 ప్రాజెక్టుల వివరాలు:**

1.క్లీన్ రెన్యూవబుల్ ఎనర్జీ హైబ్రిడ్ సిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ - కడప జిల్లా - రూ.950 కోట్ల పెట్టుబడి - 90 మందికి ఉద్యోగాలు.

2.సాయి బయోఎనర్జీ ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ లిమిటెడ్ - నంద్యాల జిల్లా- రూ.168.56 కోట్ల పెట్టుబడి-600 మందికి ఉద్యోగాలు.

3.ఎం. వెంకటరావు ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంవీఆర్ టెర్రావాంట్ జేవీ) - శ్రీ సత్యసాయి జిల్లా - రూ.3,078 కోట్లు - 1,300 ఉద్యోగాలు.

4.రిజాల్వెన్ టూ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ - కర్నూలు - రూ.980 కోట్లు - 250 మందికి ఉద్యోగాలు.

5.ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్ - విశాఖపట్నం - రూ.100 కోట్లు - 2,400 మందికి ఉద్యోగాలు.

6.డెలాయిట్ - విశాఖపట్నం - రూ.43.75 కోట్లు - 2,500 ఉద్యోగాలు.

7.ఫోటాన్‌కోర్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ - అమరావతి -రూ.9 కోట్లు - 45 ఉద్యోగాలు.

8.వెరిడాటా హెల్త్ ఇంక్. - అమరావతి - రూ.4.5 కోట్లు - 50 ఉద్యోగాలు.

9.క్వాన్ఫ్లుయెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ - అమరావతి - రూ.5 కోట్లు - 30 ఉద్యోగాలు.

10.ట్రిక్వాంటా ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ - అమరావతి - క్వాంటమ్ హార్డ్‌వేర్ - రూ.35కోట్లు - 175 ఉద్యోగాలు.

11.క్వాంటమ్ కోడాన్ ప్రైవేట్ లిమిటెడ్ - అమరావతి - క్వాంటమ్ ఏఐ/బయోటెక్నాలజీ - రూ.167 కోట్లు -126 ఉద్యోగాలు.

12.శ్రిష్టి క్వాంటమ్ ప్రైవేట్ లిమిటెడ్ - అమరావతి -క్వాంటమ్ హార్డ్‌వేర్ - రూ.100 కోట్లు -110 ఉద్యోగాలు.

13.ఆరోహక్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ - అమరావతి -క్వాంటమ్ టెక్నాలజీ - రూ.62 కోట్లు - 300 ఉద్యోగాలు.

14.గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ - మచిలీపట్నం- రూ.8,000 కోట్లు - 3,000 ప్రత్యక్ష, 5,000 పరోక్ష ఉపాధి.

15.మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ - పల్నాడు - రూ.3,000 కోట్లు- 2,000 ఉద్యోగాలు.

16.క్యాటర్‌పిల్లర్ ఇంక్. - శ్రీసిటీ, తిరుపతి - రూ.150 కోట్లు - 80 ఉద్యోగాలు.

17.ఎంఏఎఫ్ క్లోతింగ్ ప్రైవేట్ లిమిటెడ్ - కుప్పం, చిత్తూరు - రూ.215 కోట్లు - 2,560 ఉద్యోగాలు.

18.దాల్మియా సిమెంట్, కడప - రూ.395.23 కోట్లు.

19.అగర్వాల్ ఫౌండ్రీస్ - నెల్లూరు -రూ.549కోట్లు - 245 ఉద్యోగాలు.

20.శ్రీ వైభవ లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ -- నెల్లూరు -- రూ.222.63 కోట్లు - 300 ఉద్యోగాలు.

21.శ్రీ వసుధ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ -అనంతపురం - రూ.254.06 కోట్లు - 350 ఉద్యోగాలు.

22.రావోక్స్ అగ్రిటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ - చిత్తూరు - రూ.1,388.14 కోట్లు - 1,000 ఉద్యోగాలు.

23.కెల్లాగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ - శ్రీ సిటీ, సత్యవేడు -రూ.211.70 కోట్లు - 30 ఉద్యోగాలు.

24.ఎపిటోమ్ ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్ - నెల్లూరు - రూ.530.65 కోట్లు - 238 ఉద్యోగాలు.

25.హిందుస్థాన్ కోకా-కోలా బెవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ - విజయనగరం, తిరుపతి - రూ.1,127 కోట్లు - 195 ఉద్యోగాలు.

26.గ్రాండ్ తిరుపతి హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ - తిరుపతి - రూ.188.11 కోట్లు- 851 ఉద్యోగాలు.

27.సదరన్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్ - అమరావతి- రూ.167 కోట్లు - 600 ఉద్యోగాలు.

28.జేఎల్ అసోసియేట్స్ - కడప - రూ.53.25 కోట్లు - 314 ఉద్యోగాలు.

# విజయసాయి రెడ్డి నీతులు చెప్పడమా?

నిప్పులు చెరిగారు. "జగన్ తో కలిసి అడుగడుగునా అవినీతికి పాల్పడి, సీబీఐ చేతిలో అరెస్ట్ అయి, చంచల్‌గూడ జైల్లో 16 నెలలు సహ ఖైదీగా గడిపిన చరిత్ర విజయసాయి రెడ్డిది. గతంలో మాయమాటలతో జగన్‌ను గద్దెనెక్కించి, ఐదేళ్ల పాటు ఆయన వెనకుండి రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడంలో ప్రధాన సూత్రధారి ఈయనే. ఇప్పుడు అదంతా మరిచిపోయి 'మూడో ప్రత్యామ్నాయం' తెస్తాననడం సిగ్గుచేటు. 12 సీబీఐ ఛార్జ్‌షీట్లలో నిందితుడిగా ఉండి, 12 ఏళ్లుగా కోర్టు విచారణకు హాజరుకాకుండా వాయిదాలు వేయిస్తున్న వ్యక్తి, స్వేచ్ఛగా తిరుగుతూ రాజకీయం మాట్లాడటం చూస్తే న్యాయవ్యవస్థ ఎంత సరళంగా ఉందో అర్థమవుతోంది" అని వర్ల రామయ్య ఎద్దేవా చేశారు.

**నాడు జగన్‌ను తయారుచేసి.. ఇప్పుడు యువతను ఉద్ధరిస్తారా?**

అవినీతికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిన విజయసాయిరెడ్డి, ఇప్పుడు 'మెరికల్లాంటి యువతను తెస్తాం' అనడం హాస్యాస్పదంగా ఉందని వర్ల రామయ్య విమర్శించారు. "అవినీతి రహిత యువతను తయారు చేస్తానంటున్న విజయసాయికి ఆ అర్హత ఎక్కడిది? గతంలో మీరు తయారు చేసింది జగన్మోహన్ రెడ్డినే కదా? ఆయన అవినీతికి 'ఓం' అని దిద్దింది మీరే. మీ చార్టర్డ్ అకౌంటెంట్ నైపుణ్యాన్ని రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే ఉపయోగించి, జగన్‌ను ఒక పెద్ద 'అవినీతి సామ్రాట్'గా తీర్చిదిద్దారు. జగన్ లాంటి ప్రొడక్ట్‌ను తయారుచేసిన వ్యక్తి నుంచి వచ్చే యువత ఎలా ఉంటారు? మీ కొత్త పార్టీ అధికారంలోకి వస్తే రాయలసీమను 'రతనాల సీమ' చేస్తామంటున్నారు. మరి ఐదేళ్లు అధికారం మీ చేతిలో ఉన్నప్పుడు ఏం చేశారు? మీ అసమర్థత వల్లే సీమ వెనుకబడిందనే నిజం ప్రజలకు తెలియదా?" అని వర్ల రామయ్య ప్రశ్నించారు. "రాయలసీమ ఒరిజినల్ రెడ్ల పౌరుషాన్ని కాపాడుతాం" అని మాట్లాడటంపై మండిపడుతూ, "అంటే మీ ఉద్దేశంలో ఐదేళ్లు రాష్ట్రాన్ని ఏలిన జగన్ ఒరిజినల్ రెడ్డి కాదా? ఆయన దొంగ రెడ్డా?" అని నిలదీశారు.

**నిర్దోషిగా తేలాకే ప్రజల్లోకి రా!**

విజయసాయి రెడ్డికి నిజంగా ప్రజల్లోకి రావాలని ఉంటే, ముందు తనపై ఉన్న 12 ఛార్జ్‌షీట్లలో నిర్దోషిగా బయటకు రావాలని వర్ల రామయ్య సవాల్ విసిరారు. "కోర్టుకు వెళ్లి నా కేసులను రోజువారీ విచారించి, నన్ను నిర్దోషిగా ప్రకటించమని తీర్పు తెచ్చుకో. అప్పుడు ప్రజల్లోకి వస్తే నిన్ను నమ్మే అవకాశం ఉంటుంది. అంతేకానీ, తీవ్రమైన అవినీతి ముద్రతో ప్రజలను మోసం చేయాలని చూస్తే కుదరదు" అని స్పష్టం చేశారు.

**చంద్రబాబు తెలుగు జాతి సంపద**

చంద్రబాబు తెలుగు జాతి గర్వించదగ్గ మహా సంపద అని, ఆయనతో జగన్, విజయసాయి వంటి వారిని పోల్చడం సిగ్గుచేటని వర్ల రామయ్య అన్నారు. "2019లో చంద్రబాబు గారే సీఎంగా కొనసాగి ఉంటే, ఈపాటికి ఏపీ గుజరాత్‌తో పోటీపడేది. కానీ మీరు తయారుచేసిన అవినీతి డైనోసార్ వల్ల రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్లింది. రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం పెంచాలని తపించే చంద్రబాబు ఎక్కడ? అవినీతిలో పుట్టి, అవినీతిలో పెరిగిన జగన్ ఎక్కడ? చంద్రబాబు విశ్వసనీయత చూసే నేడు రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి. వరదలో కొట్టుకుపోయేవాడు గడ్డిపరకను పట్టుకున్నట్లు, ఉనికి కోసం విజయసాయి రెడ్డి 'మూడో ప్రత్యామ్నాయం' నాటకం ఆడుతున్నారు. చంద్రబాబు గారి ప్రజా పాలనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు" అని వర్ల రామయ్య హెచ్చరించారు.

# నౌకను ఢీకొట్టి మాపైనే నిందలా?

మండిపడ్డారు. "నౌకను ఢీకొట్టిన వ్యవహారంపై పాక్ రాయబారికి సమన్లు జారీ చేసిన అనంతరం ఆ దేశ ప్రతిస్పందన చూశాం. భారత్‌పై నిందలు వేసేందుకు చేసిన వారి ప్రయత్నాలన్నీ ముందస్తుగా ఊహించినవే. వారి ఆరోపణలను తిరస్కరిస్తున్నాం. ప్రమాదకర విన్యాసాలు, కసరత్తులు చేసి.. 1991లో భారత్-పాక్ చేసుకున్న ఒప్పందంలోని అంశాలను పాక్ ఉల్లఘించింది. సముద్రంలో ఢీకొనడాన్ని నిరోధించే అంతర్జాతీయ నిబంధనలను సైతం పాటించకుండా తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడింది" అని జయస్వాల్ స్పష్టం చేశారు. అయితే, ఈ ఘటనలో భారత నౌకాదళానికి చెందిన యుద్ధనౌక ఐఎన్ఎస్ కోల్‌కతాకు పెద్దగా నష్టం జరగలేదని, ప్రస్తుతం సముద్రంలోనే ఉందన్నారు.

# ఈడీ నోటీసులు

ఫోన్ ద్వారా ఆయనకు సమాచారం ఇచ్చారు. విచారణకు రావాలని ఈనెల 11నే నోటీసులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. విచారణకు తమ కార్యాలయానికి రావాలని సమాచారం ఇచ్చారు. నోటీసులు ఏ కేసులో ఇచ్చారో.. ఎందుకు ఇచ్చారో తనకు తెలియదని అంబటి రాంబాబు తెలిపారు.

# నంది నాటకోత్సవాలు

సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఎండీ విశ్వనాథన్‌తో కలిసి మంత్రి దుర్గేష్ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ..నంది నాటకోత్సవాలు కేవలం ప్రదర్శనలు కావు... తెలుగు నాటకరంగ సంస్కృతికి, నటీనటుల ప్రతిభకు పట్టం కట్టే అపూర్వ పండుగ..కళను బతికించే నాటక సమాజాలు, సమాజాన్ని చైతన్యపరిచే కళాకారులు -- తెలుగు సంస్కృతికి మూలస్తంభాలు.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల మార్గదర్శకత్వంలో కళాకారులకు సరైన గుర్తింపునిచ్చేలా ఎఫ్.డి.సి ద్వారా అనేక నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. కళలకు కాణాచి అయిన గుంటూరు జిల్లా తెనాలిలో జనవరిలో నంది నాటకోత్సవాలు జరుగుతాయి. అవార్డుల ఎంట్రీల కోసం రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేసి, అక్టోబర్‌లో సెలక్షన్ కమిటీని నియమిస్తాం. డిసెంబర్‌లో ప్రాథమికంగా ఎంపికైన నాటకాల జాబితాను ప్రకటిస్తాం. జనవరి 10న ప్రతిష్టాత్మక కందుకూరి అవార్డుల ప్రదానంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం వారం పాటు ఎంపికైన నాటకాల ప్రదర్శనలు, ఆ తర్వాత అత్యంత వైభవంగా నంది నాటకోత్సవాల పురస్కార ప్రదానోత్సవం జరుగుతుంది. ఇతర రాష్ట్రాల్లోని తెలుగు నాటక సమాజాలకు కూడా తొలిసారిగా అవకాశం కల్పిస్తున్నాం.నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (బీణ) తరహాలో వీడియోల ద్వారా పరిశీలించి పారదర్శకంగా ఎంపిక చేస్తాం. గతంలో 3గా ఉన్న కందుకూరి ప్రతిష్టాత్మక పురస్కారాలను 5 కి పెంచి, ఒక్కొక్కరికి రూ. 1 లక్ష చొప్పున అందజేస్తాం. స్థానం నరసింహారావు, ఆచార్య ఆత్రేయ, గరికపాటి రాజారావు, బందారు రామారావు తదితర దిగ్గజాల పేర్లతో ఈ పురస్కారాలు ఉంటాయి. కొత్తగా ఏర్పాటు అయిన 28 జిల్లాల ప్రాతిపదికన ప్రతి జిల్లా నుంచి ముగ్గురికి, అలాగే ప్రత్యేక సేవలు అందించిన మరొక 16 మందికి అవార్డులు ఇస్తాం. పద్యనాటకం, సాంఘిక నాటకం, రచయితలు, సాంకేతిక నిపుణులు, నాటక సమాజం కేటగిరీల్లో మొత్తం 100 మందికి/సంస్థలకు కందుకూరి విశిష్ట పురస్కారాలు ఇవ్వనున్నాం. నాటక పరిషత్తులకు ఒక్కో దానికి రూ. 5 లక్షలు ఇచ్చే బదులు, ఎక్కువ మంది కళాకారులకు లబ్ధి చేకూరేలా ఒక్కో పరిషత్‌కు రూ. 1 లక్ష చొప్పున విస్తృతంగా కేటాయిస్తున్నాం. ఇప్పటికే ఒక పర్యాయం కందుకూరి పురస్కారాలను గత ఏడాది తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 16 న 100 మందికి ఇచ్చాము. చిత్ర పరిశ్రమ, నాటకరంగానికి అవసరమైన అనుమతుల కోసం ఖీణజ ద్వారా సింగిల్ విండో విధానం తెచ్చామని తెలిపారు. సినిమా, టీవీ రంగాల నంది అవార్డులకు సంబంధించి ఈ వారంలోనే ప్రకటన విడుదల చేసి, జనవరి నాటికి ప్రదానోత్సవాలు పూర్తి చేస్తామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు.పద్య నాటకం, సాంఘిక నాటకం, నాటిక, బాలల నాటిక, కాలేజీ,యూనివర్సిటీ నాటిక, రంగస్థలం మీద బెస్ట్ బుక్ తదితర కేటగిరీల్లో నంది అవార్డులు అందిస్తామని పేర్కొన్నారు..

# ఏఐ స్కిల్స్ తప్పనిసరి

విద్యావ్యవస్థను సమూలంగా బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ "ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు అకడమిక్ ఎక్సలెన్స్‌పై దృష్టి సారించి, ప్రతిభావంతులను తయారు చేసే కేంద్రాలుగా మారాలి" అని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తొలిసారిగా పత్రికా ప్రకటనల ద్వారా అభినందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పటివరకు రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివిన వారిలో 27 మంది ఐఏఎస్‌లు, 20 మంది ఐపీఎస్‌లు, 13 మంది ఐఆర్ఎస్‌లు, నలుగురు ఐఎఫ్ఎస్‌లతో పాటు ఎందరో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని అధికారులు వివరించగా, మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు.

**కీలక నిర్ణయాలు ఇవే..**

టెక్నాలజీలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో నైపుణ్య శిక్షణను తప్పనిసరి చేయాలని, అన్ని స్కూళ్లలో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 10 ఏపీఆర్ విద్యాసంస్థలను 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇప్పటికే తాడికొండ, కొడిగినహళ్లి పాఠశాలలు ఈ జాబితాలో ఉన్నాయి. కృష్ణా జిల్లా నిమ్మకూరులోని ఏపీఆర్ జూనియర్ కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఐఐటీ-జేఈఈ/నీట్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరో 6 రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు కూడా సమావేశం ఆమోదముద్ర వేసింది.

**సిబ్బంది సంక్షేమం, మౌలిక వసతులపై దృష్టి**

సిబ్బంది సంక్షేమానికి సంబంధించి కూడా పలు ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. ఏపీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సిబ్బంది పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. గెస్ట్ ఫ్యాకల్టీ గౌరవ వేతనాలను ఇతర సొసైటీలతో సమానంగా పెంచడంతో పాటు, పీఈటీలను పీడీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు అంగీకరించింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది నియామకాలకు స్టాఫింగ్ ప్యాటర్న్‌కు ఆమోదం తెలిపారు. అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లలో శాశ్వత భవనాలు, మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని, ఆటోమేటెడ్ స్మార్ట్ కిచెన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. విద్యార్థుల వైద్య అత్యవసర పరిస్థితుల కోసం లక్ష రూపాయల వరకు ఖర్చు చేసే అధికారాన్ని సొసైటీ సెక్రటరీకి కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. జగ్గంపేట నియోజకవర్గంలోని భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రపంచస్థాయి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలించాలని లోకేశ్ ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జే. శ్యామలరావు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ రంజిత్ బాషా, ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా, ఏపీఆర్ఈఐఎస్ కార్యదర్శి కృష్ణమోహన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రూ.304 కోట్లతో కొత్త హైవే

చేయనున్నారు. వీటితో పాటు ప్రస్తుతం ఉన్న కడప బైపాస్‌ను కూడా పటిష్ఠమైన షోల్డర్స్‌తో అభివృద్ధి చేయనున్నారు. ఈ చర్యల వల్ల పారిశ్రామిక ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడి, వాహనాల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో అనుసంధానతను బలోపేతం చేయడంలో ఈ రహదారి కీలక పాత్ర పోషించనుంది. అంతేకాకుండా, కడప నగరంలో ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గించడానికి ఇది దోహదపడుతుంది. 'ప్రధాని గతిశక్తి' కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఈ ప్రాజెక్ట్, ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి ఊతమిస్తుందని కేంద్రం భావిస్తోంది. కొప్పర్తి పారిశ్రామిక హబ్ శరవేగంగా అభివృద్ధి చెందడానికి ఈ కొత్త రహదారి ఒక మైలురాయిగా నిలుస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# దానంపై అనర్హత వేటు

రద్దు చేస్తూ హైకోర్టు శుక్రవారం 91 పేజీల తీర్పు వెలువరించింది. స్పీకర్ తీర్పును రద్దు చేయాలని కోరుతూ భారాస, భాజపాలు దాఖలు చేసిన పిటిషన్‌లను అనుమతించింది. భారాస సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థిగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసినందున రాజ్యాంగంలోని పదో షెడ్యూలు పేరా 2(1)(ఎ) రెడ్‌విత్ 191(2) ప్రకారం దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తున్నట్లు పేర్కొంది. అనర్హత నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు పరిగణనలోకి తీసుకోవాలంది. ఈ ఉత్తర్వుల ప్రతిని స్పీకర్ కార్యదర్శికి, ఎన్నికల సంఘానికి పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది. దానంపై అనర్హత వేటు వేయాలంటూ భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్‌లను స్పీకర్ కొట్టివేశారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ వారిద్దరూ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ వాదనల అనంతరం ఆగస్టు 21న తీర్పు వాయిదా వేసింది. శుక్రవారం ఈ పిటిషన్‌లపై తీర్పు వెలువరించింది. దానం తరఫు న్యాయవాది జోక్యం చేసుకుంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి తీర్పు అమలును ఆరు నెలలపాటు నిలిపివేయాలని అభ్యర్థించారు. దానిపై ధర్మాసనం జోక్యం చేసుకుంటూ అనర్హత వేటు పడిన తరువాత ఒక్క రోజు కూడా కొనసాగలేరంటూ సుప్రీంకోర్టు స్పష్టం చేసిన విషయాన్ని ప్రస్తావించింది. తీర్పు అమలు నిలిపివేతకు నిరాకరించింది. తీర్పులోని ముఖ్యాంశాలు...

**స్పీకర్ నిర్ణయం న్యాయసమీక్షకు అతీతంకాదు**

"కిహోటో హోలోహన్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పదో షెడ్యూలు కింద ట్రైబ్యునల్ ఛైర్మన్‌గా స్పీకర్ వ్యవహరిస్తారు. ఆ హోదాలో తీసుకున్న నిర్ణయాలు న్యాయసమీక్షకు లోబడి ఉంటాయి. స్పీకర్ నిర్ణయంలో రాజ్యాంగ ఆదేశాల ఉల్లంఘన, దురుద్దేశం, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం, విపరీత ధోరణి ఉన్నప్పుడు న్యాయసమీక్ష చేయవచ్చు. దానం.. భారాస నుంచి ఎన్నికై 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున బరిలో దిగి భారాసకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించారు. దానికి సంబంధించి పిటిషనర్లు ఆధారాలుగా రిటర్నింగ్ అధికారికి సమర్పించిన ఫారం-26 (ఎన్నికల అఫిడవిట్), ఇతర పత్రాలను అందజేశారు. కాంగ్రెస్ తరఫున నామినేషన్ వేసినట్లు దానం అంగీకరించారు. అయినప్పటికీ స్పీకర్ అనర్హతను తిరస్కరిస్తూ పేర్కొన్న కారణాలు రాజ్యాంగంలోని అధికరణ 191(2) రెడ్‌విత్ పదో షెడ్యూలులోని 2(1)(ఎ), 2(1)(బి)లను ఉల్లంఘించేలా ఉన్నాయి. డాక్టర్ మహాచంద్రప్రసాద్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన అంశాలను కనీసం చర్చించలేదు. ఫిరాయింపుల వల్ల కలిగే అస్థిరత నుంచి సభను కాపాడటానికి స్పీకర్‌కు ప్రత్యేకమైన, పరిమితమైన అధికారాలు ఉన్నాయి. సభ పనితీరుపై ప్రభావం చూపని బాహ్య విషయాలను నియంత్రించడానికి ఈ అధికారాన్ని వినియోగించడాన్ని రాజ్యాంగం అనుమతించదు. సభ వెలుపల జరిగిన రాజకీయ కార్యకలాపాల ఆధారంగా అనర్హతను నిర్ణయించలేమన్న స్పీకర్ వాదన అంగీకారయోగ్యం కాదు. శాసనసభ్యుడి చర్యలు కేవలం శాసనసభకే పరిమితం కాదు. పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదిలిపెట్టాడా లేదా అన్నది నిర్ధారించడానికి సభ వెలుపల సభ్యుడి ప్రవర్తనను పరిగణనలోకి తీసుకోవచ్చు.

**పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లే**

భారాస సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ తరఫున పోటీ చేసినందున స్వచ్ఛందంగా భారాస సభ్యత్వాన్ని వదులుకున్నట్లే. కాంగ్రెస్ తరఫున పోటీ చేయడం అన్నది పదో షెడ్యూలులోని 2(1)(ఎ) ప్రకారం భారాస సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవడం అవుతుందా లేదా అన్నదానిపై స్పీకర్ సమాధానమిస్తూ.. 'శాసనసభ్యుడిగా ఉంటూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని రాజ్యాంగపరంగా నిషేధించలేదు.

**జాబితాలో దానం పేరు ఫొటోతో సహా ఉంది**

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున దానం రిటర్నింగ్ అధికారికి ఇచ్చిన అఫిడవిట్‌తోపాటు, అసెంబ్లీ ఎన్నికల్లో భారాస తరఫున పోటీ చేస్తూ ఇచ్చిన అఫిడవిట్‌ను పిటిషనర్లు ఆధారాలుగా సమర్పించారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్, ఫలితాల ప్రకటనలనూ సమర్పించారు. పోటీలో ఉన్న వారి వివరాలను అదనపు కలెక్టర్ విడుదల చేసిన జాబితాలో దానం పేరు ఫొటోతో సహా ఉంది. అయితే వీటన్నింటికీ ధ్రువీకరణ లేనందున తిరస్కరిస్తున్నామన్న స్పీకర్ వాదన బీఎస్ఏ సెక్షన్ 80, 81 ప్రకారం నిలబడదు. ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన విషయాన్ని దానం ఖండించనందున పదో షెడ్యూలులోని పేరా 2(1)(ఎ) వర్తిస్తుంది. ఒక పార్టీకి చెందిన సభ్యుడు మరో పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేస్తే ఆ వ్యక్తి స్వచ్ఛందంగా అసలు రాజకీయ పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నట్లేనని ఇదే హైకోర్టు ఆర్.భూపతిరెడ్డి కేసులో తీర్పు వెలువరించింది. పిటిషనర్లు సమర్పించిన ఆధారాలను దానం తిరస్కరించలేదు. వారు సమర్పించిన రికార్డుల్లోని సాక్ష్యాధారాలను, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవడంలో స్పీకర్ విఫలమయ్యారు. స్పీకర్ నిర్ణయం లోపభూయిష్టంగా ఉంది.

**తిరిగి స్పీకర్‌కు పంపాల్సిన అవసరంలేదు**

భారాస.. దానంపై అంతర్గతంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదన్న అంశాన్ని స్పీకర్ పరిగణనలోకి తీసుకోవడం సరికాదు. పదో షెడ్యూలు కింద అనర్హత చర్యలు తీసుకునే పరిస్థితులు ఏర్పడినా రాజకీయ పార్టీ అంతర్గత చర్యలు తీసుకోకపోతే అనర్హత చెరిగిపోదు. పదో షెడ్యూలు కింద విచారణను సాధారణ సివిల్, క్రిమినల్ కేసుల విచారణతో సమానంగా పరిగణించలేం. అందుబాటులో ఉన్న విశ్వసనీయమైన అధికారిక రికార్డులను పరిశీలించి నిర్ధారించాల్సి ఉంటుంది. ప్రస్తుత అనర్హత ప్రక్రియ ఏడాదిన్నరకుపైగా సాగుతూనే ఉంది. ఇప్పటికే శాసనసభ పదవీ కాలంలో దాదాపు మూడేళ్లు గడిచిపోయాయి. ఈ విషయంపై కొత్తగా నిర్ణయం తీసుకోవడానికి తిరిగి స్పీకర్‌కు పంపాల్సిన అవసరంలేదు. ఈ పరిస్థితుల్లో న్యాయసమీక్ష అధికారాలను వినియోగిస్తూ భారాస సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ తరఫున పోటీ చేసినందున అనర్హుడిగా ప్రకటించడం సముచితం. ఫలితంగా అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా పరిగణించాలి" అని తీర్పులో పేర్కొంది.

**సుప్రీంకోర్టు ఆదేశాలతో...**

దానంపై అనర్హత వేటు వేయాలంటూ 2024 ఏప్రిల్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో భారాస సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మూడు నెలల్లో నిర్ణయాన్ని వెలువరించాలంటూ 2025 జులై 31న స్పీకర్‌కు గడువు విధించడంతో ఈ మార్చి 11న స్పీకర్ తీర్పు వెలువరించారు. స్పీకరు నిర్ణయాన్ని సవాలు చేస్తూ పిటిషన్‌లు దాఖలయ్యాయి. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న మిగిలిన ఎమ్మెల్యేల పిటిషన్‌లపై విచారణ అక్టోబరులో జరగనుంది.

# మాపై రుద్దుతారేం జగన్?

ఒక ప్రకటనలో స్పందించడంతోపాటు మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు తొలిదశకు నిధులు మంజూరు చేయాలంటూ అనేక సార్లు ప్రతిపాదనలు పంపింది వైకాపా ప్రభుత్వమేనని ఆయన అన్నారు. రామానాయుడు ఇంకా ఏమన్నారంటే.. తెదేపా ప్రభుత్వం 2014-19 మధ్య ఎప్పుడూ పోలవరం ప్రాజెక్టును తొలిదశ, రెండో దశగావిభజించలేదు. అప్పట్లో (తెదేపా హయాంలో) 2019 ఫిబ్రవరి 11న దిల్లీలో కేంద్ర జలశక్తిశాఖకు చెందిన 141వ సాంకేతిక సలహా కమిటీ సమావేశమై పోలవరంలో ౦45.72 మీటర్ల ఎత్తుకు నీటిని నిల్వ చేసేలా రూ.55,548.87 కోట్లకు ఆమోదం తెలియజేసింది. 2017-18 ధరల ప్రకారం డీపీఆర్‌కు ఆమోదం లభించింది. తొలిదశ, రెండోదశ అని తెదేపా ప్రభుత్వంలో ఎక్కడైనా మేము ప్రతిపాదించామా? మీరు చేసిన తప్పిదాన్ని మా ప్రభుత్వంపై రుద్దడం ఎందుకు జగన్? జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి 2022 జనవరిలో౦41.15 మీటర్ల ఎత్తు వరకు నీళ్లు నిలబెట్టేలా రూ.10,911.15 కోట్లు ఇవ్వాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీవోకు లేఖ రాయలేదా? ఆ తర్వాత జలవనరులశాఖ ముఖ్యకార్యదర్శి, పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజినీరు కూడా అనేకసార్లు వైకాపా పాలనలో ఈ మేరకు కేంద్రానికి లేఖలు రాయలేదా?

వైకాపా హయాంలోనే 2024 ఫిబ్రవరి 16న కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు తొలిదశ అంచనా వ్యయాన్ని రూ.30,436.95 కోట్లుగా నిర్ధారించిన మాట వాస్తవం కాదా? ఈ ప్రాజెక్టును విధ్వంసం చేసి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది మీరు కాదా?

**పోలవరం మీరు పూర్తి చేసి ఉంటేఈ కష్టాలు ఉండేవా?**

వైకాపా ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేసి ఉంటే ప్రస్తుత ఎల్‌నినో లాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ 400 టీఎంసీల నీటిని వినియోగించుకునేవాళ్లం. పట్టిసీమ ప్రాజెక్టును మీరు (జగన్) వృథా ప్రాజెక్టు అనలేదా? పట్టిసీమ, పురుషోత్తపట్నం పంపులు పీకేస్తామని అనలేదా? పట్టిసీమ వల్లే ఇప్పుడు కృష్ణాడెల్టాలో 6.80 లక్షల ఎకరాలకు నీరందుతోంది.

# పుట్టిన బిడ్డకు బంగారు ఉంగరం.. 28న ప్రారంభం

వర్తింపజేయనున్నారు. ఇప్పటికే 1.28 లక్షల ఉంగరాలను ప్రభుత్వం సిద్ధం చేసినట్లు సమాచారం. అయితే, ఉప ఎన్నికలు జరగనున్న మదురాంతకం, ధారాపురం నియోజకవర్గాల్లో మాత్రం ఈ పథకం అమలుకు తాత్కాలిక బ్రేక్ పడనుంది. ఉచిత అల్పాహార పథకం విస్తరణకు మాత్రమే ఎన్నికల సంఘం నుంచి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి పొందిందని, బంగారు ఉంగరం పథకానికి అనుమతి లేదని ఈసీ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ వర్గాల ప్రకారం తమిళనాడులో ఏటా 7.8 లక్షల జననాలు నమోదవుతాయి. వాటిలో దాదాపు 4.2 లక్షల మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించినవారే. వారందరికీ ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు.

# మమతకు షాక్

సంచితా ప్రధాన్ నందిగ్రామ్ నుంచి నామినేషన్ ఉపసంహరించుకోవడంపై మమతా బెనర్జీ స్పందించారు. ఇది ప్రతిపక్షాలను అంతం చేయాలనే ఆలోచనతో భాజపా చేస్తున్న కుట్ర అని విమర్శించారు. భాజపా గతంలో మహారాష్ట్రలోని ఉద్ధవ్ ఠాక్రే పార్టీని చీల్చిందని, ఇప్పుడు తన పార్టీనీ లేకుండా చేయాలనే ఇలాంటి కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి ఇది చీకటి రోజని, తన వర్గం నుంచి ఎవరూ పోటీ చేయకుండా భాజపా అడ్డుకుంటోందని విమర్శించారు. ఉప ఎన్నికల కోసం ఇక నందిగ్రామ్ నుంచి మరెవరినీ బరిలోకి దించబోమని.. తమ పార్టీ కాంగ్రెస్ (జశీఅస్త్రతీవం) అభ్యర్థికి మద్దతిస్తుందని దీదీ ప్రకటించారు. భాజపాను దేశం నుంచి వెళ్లగొట్టడమే తన లక్ష్యమని.. అందుకోసం ఇండియా కూటమితో కలిసి పని చేస్తానని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో నందిగ్రామ్‌తోపాటు రెజీనగర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు అక్టోబర్ 6న ఉప ఎన్నిక జరగనున్న విషయం తెలిసిందే.

**కాంగ్రెస్ అభ్యర్థి అరెస్ట్**

నందిగ్రామ్ రాజకీయం రసవత్తరంగా మారింది. ఉప ఎన్నికలో మమత మద్దతు పొందిన కాంగ్రెస్ అభ్యర్థి మిలాన్ ప్రధాన్‌ను పశ్చిమ బెంగాల్ పోలీసులు అరెస్ట్ చేశారు. 2007లో భూసేకరణకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలకు సంబంధించిన ఓ కేసులో ఆయన్ను అరెస్ట్ చేశారని కాంగ్రెస్ తెలిపింది. ప్రతిపక్షాలకు రాజకీయంగా స్థానం లేకుండా చేసేందుకు అధికార భాజపా కుట్రలు పన్నుతోందని ఆ పార్టీ ఆరోపించింది. దేశంలో ప్రజాస్వామ్యం కోరుకుంటున్నారా? నియంతృత్వం కోరుకుంటున్నారా? అని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మీతా చక్రవర్తి ప్రశ్నించారు.

# టీటీడీ నెయ్యి కల్తీ కేసులో మరో కీలక అరెస్ట్

హాజరుపరిచారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం నిందితుడికి జ్యుడీషియల్ కస్టడీ విధించింది. టీటీడీకి సరఫరా చేసే నెయ్యిలో భారీస్థాయిలో కల్తీ జరిగిందనే ఆరోపణలతో తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. పామాయిల్, పామోలిన్, ఇతర రసాయనాలు కలిపి తయారు చేసిన నకిలీ నెయ్యిని, "అగ్‌మార్క్ స్పెషల్ గ్రేడ్ ఆవు నెయ్యి"గా నమ్మబలుకుతూ టీటీడీకి సరఫరా చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. 2019 నుంచి 2024 మధ్య కాలంలో సుమారు రూ. 230 కోట్ల విలువైన కల్తీ నెయ్యిని నిందితులు సరఫరా చేసినట్లు ఈడీ గుర్తించింది. ఇందులో రూ. 96 కోట్ల విలువైన కల్తీ నెయ్యిని కైలాష్ చంద్ మంగ్లా తన ఫ్యాక్టరీలో తయారు చేసినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ కుంభకోణంలో కైలాష్ చంద్ సహ కుట్రదారుడిగా వ్యవహరించినట్లు ఈడీ ఆరోపిస్తోంది. శ్రీ వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్, మల్‌గంగా మిల్క్ అండ్ ఆగ్రో ప్రొడక్ట్స్ వంటి సంస్థల పేర్లతో ఆయన కల్తీ నెయ్యిని సరఫరా చేసినట్లు గుర్తించారు. కల్తీని కప్పిపుచ్చేందుకు, అసలైన ఆవు నెయ్యిని ఉత్పత్తి చేసినట్లుగా తప్పుడు రికార్డులను సృష్టించినట్లు ఈడీ పేర్కొంది. ఇదే కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న విపిన్ జైన్‌ను ఈడీ అధికారులు గతంలోనే అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

# ఎడిటర్ వాయిస్

## మూసేసిన గేట్లు అవంతి కోసం తెరుస్తున్నారా?

వైసీపీలో ఒక విధానం ఉంది. ఎవరైనా పార్టీ గోడ దాటితే తిరిగి వారిని తీసుకోరు. ఎంతటి పెద్ద వారు అయినా ఇదే విధానం అమలు చేసుకుంటూ వస్తున్నారు. అందుకే వైసీపీలో మొదటి నుంచి ఉన్న వారు ఇపుడు ఎక్కడా కనిపించడం లేదని గుర్తు చేస్తున్నారు. అయితే ఇంత కఠినమైన రాజకీయ విధానం వైసీపీ అమలు చేస్తున్న క్రమంలో మొదటి సారి ఒకరి కోసం దానిని బ్రేక్ చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయని అంటున్నారు. ఇంతకీ ఆ వ్యక్తి ఎవరు అంటే మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు.

**స్వాగతం అంటూ :** ఆయన వైసీపీ నుంచి రెండేళ్ల క్రితం వెళ్ళిపోయారు. అంతే కాదు కూటమి ప్రభుత్వం బాగుంది అని ప్రశంసించారు. అక్కడితో ఆగలేదు, విశాఖలో వైసీపీ మేయర్ ని దించేయడంతో కూటమికి సహకరించారు. కార్పోరేటర్ అయిన తన కుమార్తెతో వైసీపీకి వ్యతిరేకంగా ఓటేయించారు. మరి ఇంత చేసిన వ్యక్తిని అయితే వైసీపీ రూల్స్ ప్రకారం అసలు తీసుకోరు. కానీ వైసీపీలో మాత్రం ఇపుడు ఆయనకు స్వాగతం పలుకుతున్నారు. ఇదే ఇపుడు వింతా విడ్డూరంగా ఉంది అంటున్నారు.

**తీసుకుని రావాలని :** అవంతి శ్రీనివాసరావుకు అయితే ఇప్పటికిపుడు రాజకీయ నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం లేదు. ఆయన హ్యాపీగా తన విద్యా సంస్థల వ్యవహారాలను చూసుకుంటున్నారు. 2028 మొదట్లో ఏ నిర్ణయం అయినా అంటున్నారు. కానీ ఇపుడు అవసరం వైసీపీది అవుతోంది. అర్జంటుగా భీమిలీకి వైసీపీ ఇంచార్జి కావాలి. స్థానిక ఎన్నికలు ముంగిట ఉన్నాయి. దాంతో అవంతి లాంటి బిగ్ షాట్ ఉంటేనే ఒడ్డుకు చేరగలమని భావిస్తోంది. అందుకే ఆయనను పార్టీలో చేర్పించాలని ఉత్తరాంధ్రా నాయకులకు వైసీపీ అధినాయకత్వం సూచించింది అని అంటున్నారు.

**డిమాండ్లు ఉంటాయా :** రాజకీయాల్లో ఎపుడూ పరిస్థితులే కీలకం అవుతాయి. అవంతి తానుగా చేరితే ఓకే. కానీ ఆయన కావాలని వైసీపీ కోరుకుంటోంది. కాబట్టి ఈ మాజీ మంత్రి నుంచి డిమాండ్లు కొన్ని పెట్టడం జరుగుతుందని అంటున్నారు. గతంలో అవంతి మంత్రిగా ఉన్నా విజయసాయిరెడ్డి మొత్తం పెత్తనం చేశారు అన్న అసంతృప్తి ఆయనకు ఉంది. అలాగే జిల్లా ప్రెసిడెంట్ గా చేసినా పార్టీకి చెందిన ఇతర నాయకుల జోక్యం ఉండేది. ఇలా సొంతంగా మాత్రం ఏ పనీ చేయనీయలేదని ఆయన అనుచరులు అంటారు.

**వన్ అండ్ ఓన్లీ ఆప్షన్ :** ఇపుడు కనుక ఆయన తిరిగి వైసీపీలో చేరితే కచ్చితంగా తన మాట నెగ్గించుకుంటారు అని అంటున్నారు. దాంతో ఆయన ఏ రకమైన డిమాండ్లు పెడతారు అన్నది కూడా వైసీపీ ఆలోచిస్తోంది. ఇక వైసీపీ ఇప్పటికిపుడు కొత్త ముఖాలను తెచ్చి వారితో ప్రయోగాలు చేసే స్థితిలో లేదు కాబట్టి అవంతి వన్ అండ్ ఓన్లీ ఆప్షన్ అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే వైసీపీ డోర్స్ ని ఓపెన్ చేసి రూల్స్ ని బ్రేక్ చేసి అవంతికి ఘన స్వాగతం పలుకుతోంది అంటే అవంతి రాజకీయ దశ మారినట్లే అని అంటున్నారు. ఇంతకీ అవంతి వైసీపీలో చేరుతారా లేదా అన్నది కూడా చూడాల్సి ఉంది మరి.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## విషాదం.. స్కూల్ మెట్ల పైనుంచి పడి విద్యార్థిని మృతి



**షాద్‌నగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో విషాదం చోటు చేసుకుంది. పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో మెట్ల పైనుంచి జారిపడి ఓ విద్యార్థిని మృతిచెందింది. నాలుగో తరగతి చదువుతోన్న వర్ణిక (9) గురువారం మెట్లు దిగుతూ ఒక్కసారిగా పైనుంచి పడిపోయింది. దీంతో బాలిక అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో స్కూల్ సిబ్బంది వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వర్ణిక శుక్రవారం మృతిచెందింది. మెట్ల పైనుంచి బాలిక పడిపోతున్న దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డయ్యాయి.

## ఆర్టీసీ క్రాస్ రోడ్డు స్టీల్ బ్రిడ్జి పైనుంచి దూకి యువకుడి ఆత్మహత్య

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్ నోట్ రాసి స్టీల్ బ్రిడ్జి పైనుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడిని పార్సీగుట్టకు చెందిన మనోజ్‌గా పోలీసులు గుర్తించారు. శివం రోడ్డులోని ఓ డయాగ్నస్టిక్ సెంటర్‌లో అతడు పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులే తన మరణానికి కారణమని సూసైడ్ నోట్‌లో మనోజ్ పేర్కొన్నాడు.

## ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

### 30 మందికి గాయాలు



**కొండపాక గ్రామీణం, విశ్వం వాయిస్ న్యూస్ :** సిద్దిపేట జిల్లా కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో సుమారు 30 మందికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుకునూరుపల్లి నుంచి బిహార్‌కు చెందిన 30 మంది వలస కూలీలు శుక్రవారం సాయంత్రం ట్రాక్టర్‌లో సిద్దిపేట వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు తిమ్మారెడ్డిపల్లి శివారులో ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది తీవ్రంగా గాయపడిన బాధితులను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సులో ఉన్న ప్రయాణికుల్లోనూ పలువురికి గాయాలయ్యాయి.

సాయికృష్ణ కస్టోడియల్ డెత్..

## సురేశ్ రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు




**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో తీవ్ర సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో సుదీర్ఘకాలంగా పరారీలో ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారి, ఏ-4 నిందితుడు గులివిందల సురేశ్‌ను సిట్ అధికారులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. లుక్ అవుట్ నోటీసు జారీ కావడంతో న్యాయవాది సలహాతో సిట్ ఎదుట లొంగిపోయిన సురేష్‌ను విచారించిన పోలీసులు, అప్పటి కృష్ణలంక సీఐ నాగరాజు, ఇతర సిబ్బందితో కలిసి అతను పాల్పడిన దారుణాలను రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. మే 7న స్టేషన్‌లో విచారణ అనంతరం సాయికృష్ణను రాణిగారితోటలోని పాడుబడ్డ భవనానికి తరలించి తీవ్రంగా కొట్టడంతో మే 12న మృతిచెందాడని, విషయం బయటకు రాకుండా అర్ధరాత్రి బైక్‌పై మృతదేహాన్ని తరలించి స్వర్గపురి శ్మశానవాటికలో దహనం చేసి ఆధారాలు మాయం చేశారని పేర్కొన్నారు. దాడికి సంబంధించిన డిజిటల్ ఫొటోలను డిలీట్ చేయడంతో పాటు, హైకోర్టులో వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని బాధితుడి బంధువులను బెదిరించి ప్రలోభపెట్టారని దర్యాప్తులో తేలింది. ఘటనా స్థలాల నుంచి ఎముకల శకలాలు, బైకులు, సీసీటీవీ ఫుటేజీలను స్వాధీనం చేసుకున్న సిట్ అధికారులు.. నిందితుడు సాక్షులను ప్రభావితం చేయకుండా 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించాలని న్యాయస్థానాన్ని కోరారు. న్యాయస్థానం సెప్టెంబర్ 24 వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. నిందితుడు సురేశ్‌ను నూజివీడు జైలుకు తరలించారు.

## తుపాకీ మిస్‌ఫైర్.. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మృతి



**నిజామాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రమాదవశాత్తు తుపాకీ మిస్ ఫైర్ కావడంతో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ హెచ్.సతీశ్ మృతిచెందారు. ఈ ఘటన నిజామాబాద్‌లో చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం విధులు ముగించుకుని వచ్చిన తర్వాత తుపాకీ క్లీన్ చేస్తుండగా అది మిస్ ఫైర్ అయింది. ఘటనాస్థలానికి నిజామాబాద్ సీపీ సాయి చైతన్య చేరుకుని పరిశీలించారు.



విశ్వం వాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు








సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత — www.viswamvoice.com


# 30 ఏళ్ల డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

**10వ డివిజన్లో ఇప్పటికే రూ.5.50 కోట్ల పనులు పూర్తి**

**మరో రూ.4 కోట్లతో రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**పద్మావతి నగర్లో రూ.80 లక్షలతో ఆర్‌సీసీ డ్రైన్... అంతర్గత సీసీ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన**



రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ : స్థానిక 10వ డివిజన్ పద్మావతి నగర్లో సుమారు 30 ఏళ్లుగా స్థానిక ప్రజలను వేధిస్తున్న డ్రైనేజీ సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం పద్మావతి నగర్లో రూ.80 లక్షలతో చేపట్టనున్న ఆర్‌సీసీ డ్రైన్, అంతర్గత సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ పద్మావతి నగర్‌తో తెలుగుదేశం పార్టీకి ప్రత్యేకమైన అను బంధం ఉందన్నారు. టీడీపీ వ్యవస్థాప కులు నందమూరి తారక రామారావు పార్టీ స్థాపించిన సమయంలో ఈ ప్రాంతంలోనే తొలినాళ్లలో సమావేశం నిర్వహించారని, అందుకే ఈ ప్రాం తంతో పార్టీకి భావోద్వేగ అనుబంధం ఉందన్నారు. ఇక్కడే మినీ మహానాడు కూడా నిర్వహించామని గుర్తుచేశారు. గత 25-30 ఏళ్లుగా డ్రైనేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింద న్నారు. నిధులు పరిమితంగా ఉన్నప్పటికీ అత్యవసరమైన, ప్రజలకు నేరుగా ఇబ్బంది కలిగిస్తున్న సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ పనులు చేపడుతున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 10వ డివిజన్‌లో ఇప్పటికే సుమారు రూ.5.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించి పూర్తి చేశామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. తాజాగా రూ.80 లక్షలతో 1,080 మీటర్ల మేర డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. అదేవిధంగా పద్మావతి నగర్లో రోడ్ల అభివృద్ధికి సుమారు రూ.4 కోట్ల అంచనాలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. పుష్కర పనుల్లో భాగంగా నగరంలో చేపట్టనున్న సుమారు రూ.300 కోట్ల అభివృద్ధి పనుల్లో పద్మావతి నగర్‌తో పాటు 10వ డివిజన్‌లోని గాదాలమ్మ నగర్, అలకాపురి లే అవుట్ అభివృద్ధి పనులు కూడా ఉన్నాయని తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. పద్మావతి నగర్లో తాగునీటి సరఫరా సమస్యను పరిష్కరించేందుకు కూడా చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం బత్తినగర్ నుంచి నీటి సరఫరా జరుగుతున్నందున తగినంత నీటి ఒత్తిడి రావడం లేదన్నారు. హైవే అవతల ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి పద్మావతి నగర్‌కు పైప్‌లైన్ ద్వారా నీటిని తీసుకురావాలని నిర్ణయించామని, ఇందుకోసం రూ.15 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. జాతీయ రహదారుల శాఖ నుంచి అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లు నిర్వహించి, సుమారు నెల రోజుల్లో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్పొరేషన్‌కు ఎన్నికలు జరగకపోవడం వల్ల 15వ ఆర్థిక సంఘం నిధులు అందకపోయినా, అందుబాటులో ఉన్న నిధులతో ప్రజలకు అత్యంత అవసరమైన పనులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నామని ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. అభివృద్ధి పనుల్లో రాజకీయ ప్రయోజనాలు కాకుండా ప్రజలు సంతృప్తి చెందుతున్నారా లేదా అన్నదే తమకు ప్రధాన కొలమానమని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో కూడా ఇదే విధానంతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాజమహేంద్రవరం నగరంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామన్నారు.

# వైభవంగా దేవీ నవరాత్రులకు రాట ముహూర్తం



రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ : కోరుకొండ రోడ్డు వీవర్స్ కాలనీ సెంటరులో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గా సాయి మందిరంలో శ్రీ దేవీ నవరాత్రులు ఘనంగా నిర్వహించేందుకు జోన్నాడ వీర వెంకట సుబ్బారావు,శ్రీదేవి దంపతులు శుక్రవారం ఉదయం 10.36 గంటలకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రాట మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ముఖ్య అతిధిగా శ్రీ వెంకటేశ్వర ఫైనాన్స్ అధినేత మదన గోపాల్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ ఏడాది మరింత ఘనంగా దేవీ నవరాత్రులు నిర్వహిస్తామని చెప్పారు. రాట ముహూర్తం కార్యక్రమంలో దుద్దుపూడి శ్రీనివాస్,పద్మావతి, మాజీ కార్పొరేటర్లు కంటిపూడి శ్రీనివాస్, కంటిపూడి పద్మావతి, జవ్వాది మురళీ కృష్ణ జవ్వాది విజయలక్ష్మి,రేలంగి శ్రీదేవి, రేలంగి నాగేశ్వరరావు, పాలవలస వీరభద్రం, మరపు అప్పారావు,రెడ్నం తిరుపతి రాయుడు, నాగేశ్వరరావు, బి.వెంకటేశ్వరరావు, జోన్నాడ దుర్గ,జొన్నాడ భజే నారాయణ,చంద్ర సప్లైకంపెనీ ప్రసాద్, ఎన్.సత్యనారాయణ, వేమురెడ్డి, బలగాని సురేష్, పినిశెట్టి రాజు, బి.సూర్యనారాయణ, సిరిగిరి శ్రీనివాస్, వి.హరిగణేష్, ఎన్.వి.వి సత్యనారాయణ,కాలెపు శ్రీదేవి,కాలెపు అరుణ, కాలెపు దేవి, గంగుల రమాదేవి,దుడ్డే వాణిశ్రీ,మార్ని బాల,బి.అరుణాదేవి, తోట జయలక్ష్మి,కర్రి సురేఖ,కెల్లా బ్రదర్స్,వెంకటేష్,నెక్కంటి రామారావు,అల్లూరి సూరి ప్రసాద్,కర్రి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మొండి బకాయిలపై

# కఠినంగా వ్యవహరించాలి

**మునిసిపల్ దుకాణాలపై సమీక్షలో కమిషనర్ రాహుల్ మీనా**



రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ : నగరపాలక సంస్థ స్వయం సమృద్ధి సాధించడానికి మరియు నగర అభివృద్ధి పనులను చేపట్టడానికి ఆస్తి పన్ను వసూళ్లతో పాటు షాపుల అద్దెల రూపంలో వచ్చే ఆదాయం కూడా చాలా కీలకమని కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని మీటింగ్ హాల్ నందు షాపుల అద్దె బకాయిలు, లీజులు, ఆక్షన్లు, రెన్యూవల్స్ మరియు కోర్టు కేసులపై రెవిన్యూ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలోని 44 వాణిజ్య సముదాయాలకు సంబంధించి 694 దుకాణాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన అద్దె బకాయిలన్నిటినీ ఎప్పటికప్పుడు వసూలు చేస్తున్నామని, లేనిపక్షంలో నోటీసులు జారీచేస్తున్నట్లు వివరించారు. షాప్ లీజులు పూర్తైన వాటికి నిబంధనల ప్రకారం లీజులను పునరుద్ధరించాలని.. అలాగే 25 సంవత్సరాలు పై బడిన వాటికి వేలము ప్రక్రియ ఎప్పటికప్పుడు నిర్వహించాలని ఈ సందర్భంగా కమిషనర్ ఆదేశించారు. కొందరు లీజుదారులు కోర్టులో జమ చేసిన మొత్తాన్ని కోర్టు అనుమతితో మున్సిపల్ ఖాతాకు నిధులను బదిలీ చేసుకునేలా అవసరమగు చర్యలు తీసుకోవాలని సూచించారు. షాపులకు సంబంధించి ప్రత్యేక మాడ్యుల్ తయారుచేసి, అన్ని షాపులను మ్యాపింగ్ చేయాలని.. ప్రతిఒక్క షాపుకు సంబంధించిన లీజు గడువు, చెల్లింపులు, బకాయిల వివరాలు, కోర్టు కేసుల వివరాలన్నీ డ్యాష్ బోర్డులో కనిపించేలా ఆన్ లైన్ పోర్టల్ లో అప్ లోడ్ చేయవలసిందిగా సూచించారు. అలాగే రెవిన్యూ అధికారులు ప్రతిఒక్క షాపింగ్ కాంప్లెక్స్ కండిషన్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించి.. మరమ్మతులకు గురైన దుకాణాల వివరాలకు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, రెవిన్యూ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, లలిత, సీఓసీ ఇంఛార్జి రవితేజ, రెవిన్యూ ఇన్స్ పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వినాయకునికి వైభవంగా నిత్య పూజలు



రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ : స్థానిక 23వ డివిజన్లో ఉన్న నందివాడ వారి వీధిలో శ్రీ వజ్ర గణపతి ఆలయ మందిరం వారి శ్రీ లక్ష్మీ గణపతి నవరాత్రి మహో త్సవాలలో భాగంగా నిత్య పూజా కార్యక్ర మాలు వైభవంగా జరిగాయి. శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలలోనాగుమిల్లి గుప్తా, శిరీష, నాగుమిల్లి శ్రీనివాస్, హేమలత, యలమర్తి సోమేశ్వరరావు, హేమ దంపతులచే పూజా కార్యక్రమాలు జరిగాయి. పురోహితులు బోడెం రవి కుమార్ పూజ కార్యక్రమాలు నిర్వ హించారు. ఈ మహోత్సవాలలో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామి వారిని దర్శించు కున్నారు. సాయంత్రం రామాంజనేయ భజన మండలి వారిచే భజన కార్యక్రమం జరిగింది. అనంతరం హౌసి, లక్కీ డిప్ నిర్వహించారు. నవరాత్రులు సందర్భంగా ప్రతిరోజు రాత్రి స్వామి వారికి ఏకాదశ హరతులు ఇస్తున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు, సిసిసి ఎండి పంతం కొండలరావు, చందా సత్రం మాజీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ, పేరూరి మహేంద్రనాథ్,పొత్తూరి యతిరాజ్ సంపత్ కుమార్, సరిదే ధన వెంకటేశ్వరరావు, కనమర్లపూడి చంద్రకాంత్, మారడుగుల సుబ్బయ్య, వానపల్లి మురళీకృష్ణ, నంబూరి కృష్ణ చైతన్య, సోమిశెట్టి భీమేశ్వరరావు, జ్యోతి రామ్ విఠల్ మోరే, వాకచర్ల భరత్ ఫ్రెండ్స్ సర్కిల్ హాజరయ్యారు.










# గోపాలపురం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

• ప్రజా దర్బార్‌లో 712 వినతులు • అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు • అసంపూర్తి కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు పూర్తి
• రోడ్లు,కల్వర్టులు, పుష్కర ఘాట్ల నిర్మాణానికి చర్యలు • ప్రజా దర్బార్‌తో సమస్యలు వెలుగులోకి • స్థానిక సంస్థల ద్వారా మరింత అభివృద్ధి
• అర్హులందరికీ పెన్షన్లు, ఇళ్ల స్థలాలు : ఎమ్మెల్యే బండారు సత్యానందరావు




**గోపాలపురం, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** గోపాలపురం గ్రామాన్ని తన సొంత గ్రామంలాగే భావించి, గ్రామ సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం గోపాలపురం గ్రామంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 712 వినతులు అందగా, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోపాలపురం గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామంలో ఇంకా చేపట్టాల్సిన అనేక అభివృద్ధి పనులు ఉన్నాయని, వాటికి అవసరమైన మరిన్ని నిధులను తీసుకువచ్చి పనులను పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు.గతంలో ప్రారంభించిన కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు కొన్ని ఇంకా అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి చేస్తామని బండారు సత్యానందరావు తెలిపారు. ఈ ఏడాది కనీసం రెండు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు.గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కల్వర్టుల నిర్మాణంతో పాటు పుష్కర ఘాట్ల అభివృద్ధికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామంలోని మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. గోపాలపురం గ్రామంలో ఇన్ని సమస్యలు ఉంటాయని తాను ఊహించలేదని ఎమ్మెల్యే అన్నారు. గతంలో ఈ గ్రామం నుంచి శాసనసభ్యులుగా పనిచేసిన వారు ఉండటంతో అనేక సమస్యలు పరిష్కారమై ఉంటాయని భావించానని, అయితే ప్రజా దర్బార్ నిర్వహించిన అనంతరం గ్రామంలో ఇంకా అనేక సమస్యలు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. గ్రామంలోని ఉమ్మడి సమస్యల పరిష్కారంతో పాటు వ్యక్తిగత సమస్యలపైనా ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. పెన్షన్లు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు, ఇళ్ల స్థలాలు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.స్థానిక సంస్థల్లో ఎన్డీఏ కూటమి నాయకులను గెలిపించుకోవడం ద్వారా ప్రభుత్వ నిధులను సమర్థంగా వినియోగించుకుని గోపాలపురం గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన తెలిపారు.

### ఈతకోటలో ప్రధాని మోదీకి

## ఆశీర్వాద దీపంతో జన్మదిన శుభాకాంక్షలు




**రావులపాలెం, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాని నరేంద్ర మోడీ 76వ జన్మదినోత్సవాన్ని. ఆయన 25ఏళ్ళ ప్రజాసేవ ప్రస్థానం పురస్కరించుకుని బీజేపీ నేత. ఆశీర్వాద దీపం జిల్లా కో కన్వీనర్ గంధ్రోతు వీరగోవిందరావు ఆధ్వర్యంలో ఈతకోట గ్రామంలోని శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి వారి మరియు శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి 108 ఆశీర్వాద దీపాలను వెలిగించిన ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు. మహిళలు రావులపాలెం, దేశం కోసం నిరంతరం శ్రమిస్తున్న భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవ ప్రస్థానంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం నాడు ఆయన 76వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ జాతీయ పార్టీ పిలుపు మేరకు రమండలం పరిధిలోని ఈతకోట గ్రామంలో మోదీ జీ సేవా సంకల్పానికి ప్రజల ఆశీర్వాదాల వెలుగులను అందజేశారు గ్రామంలోని శ్రీఉమారామలింగేశ్వరస్వామివారి ఆలయంలో మరియు శ్రీ వేణుగోపాలస్వామివారి దేవస్థానాల్లో సాయంత్రం వేళ బీజేపీ సీనియర్ నాయకులు. ఆశీర్వాద దీపం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కో కన్వీనర్ గంధ్రోతు వీరగోవిందరావు ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాద దీపం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు శివాలయంలో అర్చకులు శివకోటి దుర్గాచంద్రశేఖర్ శర్మ.విష్ణులయంలో ఖండవిల్లి పాండురంగా చార్యులు పూజలు నిర్వహించి దేశం ప్రజలు సుభిక్షంగా వర్ధిలుతూ ఉండాలని ప్రధాని మోడీకి ఆశీస్సులు అందజేశారు ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు మహిళలు పాల్గొని 108 దీపాలు వెలిగించి నరేంద్ర మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తు ఆయనకు ఆయురారోగ్యాలు, బలాన్ని ప్రసాదించి, దేశసేవలో మరెన్నో సంవత్సరాలు కొనసాగించేలా ఆశీర్వదించాలని భగవంతులను ప్రార్ధించి తమ ఆశీర్వాదాలు అందించారు ఈ సందర్భంగా వీరగోవిందరావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా సేవ, సమర్పణల కాంతిని ప్రతిబింబించేలా చీకటిని పారద్రోలే ఒక చిన్న దీపం దేశానికి వెలుగునిచ్చే ఆశగా మారినట్లు, మోడీజీ ఆలోచనలు నాయకత్వం కోట్లాది మంది భారతీయుల జీవితాల్లో ప్రగతి కాంతులను నింపాయన్నారు స్వచ్ఛ భారత్ నుండి ఆత్మనిర్భర్ భారత్ వరకు ఆయన చేపట్టిన ప్రతి సంకల్పం దేశాన్ని స్వయం సమృద్ధి దిశగా నడిపించే శ్రేయోదీపంలా వెలుగుతోందన్నారు దేశ పురోగతి కోసం తమ జీవితాన్ని అంకితం చేసిన ప్రధాని నరేంద్ర మోడీకి జన్మదిన శుభాకాంక్షలు ఆయన ఆశయాల వెలుగులో మనం కూడా సమాజ సేవకు పునాది వేస్తూ, నవ భారత నిర్మాణంలో భాగస్వాములవుదాంమన్నారు ఈ కార్యక్రమంలో ఈతకోట జనసేన ఎంపీటీసి బొరుసు సీతారత్నం, జెడ్పి పాఠశాల ఎస్ ఎమ్ సి. చైర్మన్ పిప్పర రమేష్. అత్మాకమిటీ డైరెక్టర్ మట్టా వెంకటరమణ. మాజీ ఎంపీటీసిలు టిడిపి నాయకులు కముజు గణపతి. గంధ్రోతు రాజు.కడలి గోపి.బీజేపీ ఎస్ సి మోర్చా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు పొనుగుపాటి శ్రీనివాస్.కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పెన్మెత్స నరసింహరాజు. బీజేపీ రావులపాలెం మండల అధ్యక్షులు కొవ్వూరి ఈశ్వర్ రెడ్డి. మహిళా మోర్చా జోనల్ మాజీ ఇంచార్జి. వీబిజిరాం జి రావులపాలెం మండల కన్వీనర్ నందం శ్రీలక్ష్మి. కో కన్వీనర్ మండవిల్లి సతీష్.ఓబీసీ మోర్చా నాయకులు బోర్రా ఆంజనేయులు.భాస్కర్ రెడ్డి. బొరుసు సుబ్రహ్మణ్యం. నాగిరెడ్డి సతీష్. కూటమి నాయకులు కార్యకర్తలు. మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించిన

## గొల్లపాలెం విద్యార్థినులకు అభినందనలు

**కాజులూరు, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** సెప్టెంబర్ 11 నుండి 13 వరకు బొబ్బిలిలో జరిగిన సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ స్టేట్ మీట్ లో ఉమ్మడి తూర్పు గోదావరి బాలికల జట్టు తృతీయ స్థానం సాధించింది.. ఈ టీమ్ లో గొల్లపాలెం హై స్కూల్ నుండి 6 గురు విద్యార్థినిలు ఉత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్ఎస్సైస్ బి సుశీలామణి తెలిపారు. శుక్రవారం పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కాంస్య పతకం సాధించిన కే లోకేశ్వరి దీపిక, డి సంగీత, బి మేఘన, బి ప్రసన్న, డి సంగీత, పి వినీతలను అభినందించారు.విజేతలను, శిక్షణ ఇచ్చిన పీడీలు జి సునీల్ కుమార్, వి ఇమ్మాన్యేల్ రాజులను ఎంపీడీఓ రాంబాబు, నీటి సంఘం అధ్యక్షులు తాడి రామారెడ్డి, చుండ్రు వీర్రాజు చౌదరి, తోట కృష్ణ, తాడి వాసు రెడ్డి దేగల నాగేంద్ర, దేగల సతీష్, దీవెన మెడికల్స్ వెంకన్న బాబు,పలివెల రాజు, నక్క శ్రీను, అంగర శ్రీను, కోకా హరి ,అర్టోస్ చిన్న ..పాఠశాల ఉపాధ్యాయులు పి గంగరాజు, ప్రసాద్ అభినందించారు



## ఎక్స్పోజర్ విజిట్ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల వెదిరేశ్వరం






**రావులపాలెం, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫాన్స్ జిల్లా రావులపాలెం మండలం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రేజింగ్ ఇండియా)సెప్టెంబర్ 5 2022 నూతన విద్యా విధానంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ యొక్క పథకాన్ని ప్రకటించారు. రావులపాలెం మండలంలో ఈ పాఠశాల ఎంపిక కాబడింది . లెర్నింగ్, డిస్కవరీ, ఓరియంటెడ్, స్మార్ట్ క్లాసులు, క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ పిల్లలు మేధో శక్తిని పెంచడానికి ఈ యొక్క పథకం ఉపయోగపడుతుంది. ఇందులో భాగంగా పిల్లలకి ఎక్స్పోజర్ విజిట్ ద్వారా రిటైల్ , సేల్స్ అండ్ మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ ఏ విధంగా చేస్తున్నారు అనే దాని గురించి అవగాహన కల్పించాలి ఈరోజు రావులపాలెం విశాల్ మెగా మార్ట్ మరియు రమ్య ఫుడ్స్ ఎల్ ఎల్ పి గంటి కి 9వ తరగతి 10వ తరగతి విద్యార్థులను సందర్శనకి తీసుకు వెళ్లడం జరిగింది. జి సుజిత, రిటైల్ అండ్ సేల్స్ ,బి సాయి కుమార్ ఫుడ్ ప్రాసెసింగ్ టీచర్స్, అదేవిధంగా పాఠశాల హెచ్ఎం వి మురళీకృష్ణ, ఉపాధ్యాయులు రాంప్రసాద్ , కృష్ణారావు పద్మావతి, ప్రసన్న కుమారి, ఈ నాగకుమారి మరియు ఎస్ఎంసి చైర్మన్ మారే సుబ్బాయమ్మ ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది అని ఎస్ఎంసి చైర్మన్ మారే సుబ్బయమ్మ తెలియజేశారు.

## వాసంశెట్టి మనోహర్‌కి అక్షయ ఆర్థిక సహాయం



**రావులపాలెం, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట మండలం చిన్న గుళ్ళ పాలెం కి చెందిన వాసంశెట్టి మనోహర్ అనే 20 ఏళ్ల అబ్బాయికి తల సేమియా ఆపరేషన్ చేశారు 30 లక్షల వరకు ఖర్చయింది వీళ్ళ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కారణంగా అక్షయ సేవా సంస్థని ఆర్థిక సహాయం కోరగా సంస్థ నుంచి .10000 రూపాయలు. కే పావని 1000 రూపాయలు. కామగళ్ల మల్లేశం 500 రూపాయలు మిరియాల సుబ్బరాజు 500 రూపాయలు మొత్తం 12,000 రూపాయలు సంస్థ సభ్యులు చేతుల మీదగా మనోహర్ తల్లి కి ఇవ్వడం జరిగింది దీనికి సహకరించిన సభ్యులందరికీ ధన్యవాదములు తెలియజేశారు.

### భవిష్యత్ ఇంధన అవసరాలకు

## ప్రత్యామ్నాయ వనరులే కీలకం

### జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో డీఈఓ డాక్టర్ ఎస్.కే.మహబూబ్ బాషా



**అమలాపురం, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** భవిష్యత్తులో పెరుగుతున్న ఇంధన అవసరాలను తీర్చేందుకు ప్రత్యామ్నాయ, పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి డా. ఎస్.కే. మహబూబ్ బాషా అన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ సెమినార్-2026 జిల్లా స్థాయి పోటీలు శుక్రవారం అమలాపురంలోని జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. 'ఇండియన్ ఎనర్జీ బాస్కెట్ 2047: ప్రాస్పెక్ట్స్ అండ్ ఛాలెంజెస్' అనే అంశంపై ఈ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా డీఈఓ డా. ఎస్.కే. మహబూబ్ బాషా మాట్లాడుతూ ప్రస్తుత ఇంధన వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు ప్రత్యామ్నాయ, పునరుత్పాదక ఇంధన వనరులను అభివృద్ధి చేసుకోవడం అత్యంత అవసరమన్నారు. సౌరశక్తి, పవనశక్తి, బయోగ్యాస్, గ్రీన్ హైడ్రోజన్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇంధన వినియోగంలో శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. ఇంధన భద్రత, పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన అభివృద్ధి కోసం ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగాన్ని విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అమలాపురం జిల్లా ఉప విద్యాశాఖ అధికారి డి. కిషోర్ కుమార్, రామచంద్రపురం జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పి. రామలక్ష్మణమూర్తి, కొత్తపేట జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి. హనుమంతరావు, జిల్లా సైన్స్ అధికారి టి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా పి.వి. బ్రహ్మానందం, ఏ.వి. లక్ష్మీ నరసింహారావు, పి. సత్యబాబు వ్యవహరించారు. వివిధ మండలాల నుంచి ఎంపికైన విద్యార్థులు నిర్దేశిత అంశంపై తమ శాస్త్రీయ పరిజ్ఞానం, విశ్లేషణాత్మక ఆలోచనా విధానం, ప్రసంగ నైపుణ్యాన్ని ప్రదర్శించారు.

ప్రథమ స్థానం: జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, గొల్లవిల్లి
ద్వితీయ స్థానం: జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, తొండవరం
తృతీయ స్థానం: జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, వాడలరేవు

జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు తదుపరి దశ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్ పోటీలు సెప్టెంబర్ 21 నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి టి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం తెలిపారు. పోటీలో విద్యార్థులు నిర్దేశిత అంశంపై ఆరు నిమిషాల పాటు ప్రసంగించడంతో పాటు రెండు నిమిషాల ప్రశ్నోత్తర కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, విశ్లేషణాత్మక దృక్పథం, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు భవిష్యత్ ఇంధన అవసరాలు, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, స్థిరమైన అభివృద్ధిపై అవగాహన కల్పించేందుకు ఈ సెమినార్ దోహదపడింది.

ప్రజా ఫిర్యాదులపై

# సత్వర చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్



**కాకినాడ, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యలపై అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని కాకినాడ జిల్లా కలెక్టర్ హరేంద్రప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సామర్లకోట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సూర్యనారాయణ పెద్దాపురం ఆర్డీవో కృష్ణమూర్తి అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక( పిజిఆర్ఎస్) నిర్వహించారు. ఒక నెల ఒక గ్రామం నాలుగు తనిఖీలు కార్యక్రమంలో భాగంగా పిజిఆర్ఎస్ నిర్వహించగా 59 మంది ప్రజలు కలెక్టర్ కు అర్జీలను అందించారు. డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాథ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి సంక్షేమాలకు కూటమి ప్రభుత్వం ద్వారా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని రంగనాథ్ తెలిపారు. సామర్లకోట పెద్దాపురం తహశీల్దార్లు శ్రీనివాస్, చంద్రశేఖర్ రెడ్డి సామర్లకోట ఎంపీడీవో హిమామహేశ్వరి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, సివిల్ సప్లై డైరెక్టర్ తుమ్మల పద్మజ అధికారులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా

# ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు

తుని ఎమ్మెల్యే యనమల దివ్య



**కోటనందూరు, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** అర్హతే ప్రామాణికంగా ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు అందజేస్తామని లబ్దిదారుల ఎంపికలో ఎలాంటి రాజకీయ వివక్షత ఉండబోదని ప్రభుత్వ విఫ్ యనమల దివ్య స్పష్టం చేసారు. కాకినాడ జిల్లా,తుని మండలం రాపాకలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కు విచ్చేసిన ఆమె ప్రజా వినతులు స్వీకరించారు.పెన్షన్లు, హౌసింగ్ వంటి పథకాలపై వచ్చిన అర్జీలపై స్పందించిన ఎమ్మెల్యే యనమల దివ్య అందరి సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.తుని మండల టీడీపీ అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి అధ్యక్షతన జరిగిన ప్రజా దర్బార్ కు సీనియర్ నేత యనమల రాజేష్ తో కలిసి ఎమ్మెల్యే యనమల దివ్య ముఖ్య అతిధిగా విచ్చేసారు.వివిధ అధికారులతో కలిసి ప్రజాదర్బార్ నిర్వహించిన ఆమె ప్రజా వినతులు స్వీకరించారు.ఎక్కువ సంఖ్యలో పెన్షన్లు హౌసింగ్ తదితర అంశాలపై స్పందించిన ఆమె నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తామని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు.రెండేళ్ళ కాలంలో రాపాకలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన ఆమె ప్రజా అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ నిధుల కేటాయింపులు చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు మంతిన గంగాధర్ , గంధం బాబ్జి, ఉండ రాము, కర్రీ శ్రీనివాసరావు, గంటల సత్యనారాయణ, గంతగోరు సత్యనారా యణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వారాహి ఆలయం స్వాధీనంపై భక్తుల ఆగ్రహం

కలెక్టరేట్ వద్ద మహిళల ధర్నా



**కాకినాడ, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం కోరుపల్లి గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ వారాహి అమ్మవారి ఆలయాన్ని ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ భక్తులు, స్థానిక మహిళలు భగ్గుమన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన, ధర్నా నిర్వహించారు. ఆలయ స్వాధీన ప్రక్రియను తక్షణమే నిలిపి వేయాలంటూ నినాదాలతో వారు హోరెత్తించారు. ఎన్నో ఏళ్లుగా తామంతా భక్తిశ్రద్ధలతో కొలుస్తూ, గ్రామస్థుల విరాళాలతో కష్టపడి ఆలయాన్ని అభివృద్ధి చేసుకున్నామని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలావస్థ లో ఉన్న ఆలయాలను పట్టించుకోని పాలకులు భక్తుల కృషితో దినదినాభివృద్ధి చెందుతున్న ఆలయాలను చేజిక్కించుకోవాలని చూడటం శోచనీయమని మండిపడ్డారు. పవిత్రమైన మంగళవారం నాడే ఆలయాన్ని హస్తగతం చేసుకోవాలని అధికారులు ప్రయత్నించడం పై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.?తమ మనోభావాలను దెబ్బతీసేలా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలని, ఆలయ నిర్వహణ బాధ్యతలను స్థానికులకే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆలయాన్ని కాపాడుకునే వరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని మహిళలు, గ్రామస్తులు స్పష్టం చేశారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు.

# ప్రతి ఇంటికి ఉద్యోగ కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## తుని ఎమ్మెల్యే యనమల దివ్య





**కోటనందూరు, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి ఇంటికీ ఉద్యోగ కల్పన లక్ష్యం...ఇది తన ముందుఉన్న కర్తవ్యమని, యువతకు ఉద్యోగం, నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన అజెండాగా పని చేస్తున్నామని ప్రభుత్వ విఫ్ తుని ఎమ్మెల్యే యనమల దివ్య పునరుద్ఘాటించారు.తుని ఆదిత్య కాలేజ్ లో జరిగిన యువత భవిష్యత్ కు భరోసా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన యనమల దివ్య ఓవైపు అభివృద్ధి మరో వైపు ఉద్యోగ ఉపాధి కల్పన అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి ఆదిశగా అభివృద్ధి ప్రణాళికలు రచయిస్తున్నామని చెప్పారు. నిన్న మొన్నటి వరకు వాణిజ్య కేంద్రంగా ఉన్న తుని భవిష్యత్‌లో పారిశ్రామిక ప్రగతికి పునాదిగా నిలుస్తుందన్నారు. విపక్షం నిరాధార ఆరోపణలను తిప్పి కొట్టిన యనమల దివ్య డీఎస్సీ నియామాకాలపై వైసీపీ లొల్లిని తూర్పారబడుతూ యువత ఏదీ నిజమెంతో గుర్తెరగాలన్నారు. ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో లో కూటమి నాయకులు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, యినుగంటి సత్యనారాయణ,కుసుమంచి శోభారాణి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్,మల్ల గణేష్, పరవాడ తాతబాబు తదితరులు పాల్గొన్నారు. యువత భవిష్యత్‌కు భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "యువత భవితకు భరోసా" కార్యక్రమంలో భాగంగా తుని నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యనమల దివ్య యువతతో ముఖాముఖి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, మెగా డీఎస్సీ, పోటీ పరీక్షలు, కెరీర్ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై విద్యార్థులు, నిరుద్యోగ యువతతో చర్చించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ముఖాముఖి సందర్భంగా యువత తమకు ఎదురవుతున్న విద్య, ఉద్యోగ, శిక్షణా సంబంధిత సమస్యలను ఎమ్మెల్యే దివ్య దృష్టికి తీసుకువచ్చారు. విద్యాసంస్థల్లో అవసరమైన మౌలిక వసతులు, విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాలపై కూడా పలు సూచనలు చేశారు. యువత నుంచి వచ్చిన అభిప్రాయాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైన మేరకు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. యువతతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం, భవిష్యత్ అవకాశాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

# అర్ధాకలితో ఉద్యోగాలు కొనసాగిస్తున్నాం

## జీతాలు పెంచి మా సమస్యలు పరిష్కరించండి - ప్రభుత్వానికి విన్నవిస్తున్న వీఆర్ఏలు
## 3వరోజు కొనసాగుతున్న వీఆర్ఏల నిరవధిక సమ్మె



**కోటనందూరు, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** అర్ధాకులతో ఉద్యోగాలు కొనసాగిస్తున్నాం జీతాలు పెంచి మా సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు అల్లంపల్లి తాతారావు ప్రభుత్వానికి విన్నవించారు. వీఆర్ఏల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కోటనందూరు లో వీఆర్ఏలు చేపట్టిన నిరవధిక సమ్మె 3వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం ప్రెసిడెంట్ అల్లంపల్లి తాతారావు సీఐటీయూ నాయకురాలు షేక్ పద్మ మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా వీఆర్ఏల వేతనాల్లో ఒక్క రూపాయి కూడా పెరుగుదల లేకపోవడంతో చాలీచాలని జీతాలతో వీఆర్ఏలు, వారి కుటుంబాలు అర్ధాకలితో జీవించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా, వీఆర్ఏల ఆదాయం మాత్రం పెరగకపోవడం వల్ల కుటుంబ పోషణ భారంగా మారిందని తెలిపారు.

**వీఆర్ఏల ప్రధాన డిమాండ్లు:**

వీఆర్ఏలందరికీ తెలంగాణ తరహాలో పే స్కేల్ అమలు చేయాలి.
వీఆర్ఏలుగా పనిచేస్తున్న వారందరికీ ఓపెన్ సెలక్షన్ ద్వారా నియామకం కల్పించాలి.
అర్హత కలిగిన వీఆర్ఏలకు 70 శాతం ప్రమోషన్లు కల్పించాలి.
వివిధ కారణాలతో తొలగించబడిన వీఆర్ఏల కుటుంబాల్లోని వారసులకు ఉద్యోగాలు కల్పించాలి. పెరిగిన జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలను తక్షణమే పెంచాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు, రెవెన్యూ శాఖకు మధ్య వారధిగా పనిచేస్తున్న వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చర్చలు జరిపి పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని వీఆర్ఏలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేడికొండ జోగిరాజు, చిట్టి మూరి అప్పలకొండ, అప్పయ్యమ్మ, జ్యోతి, భవాని, వరలక్ష్మి, లక్ష్మీ, అప్పారావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ గారు మా చదువులు ఆగిపోకుండా చూడండి

## కుల ధ్రువీకరణ పత్రాల కోసం మండుటెండలో చిన్నారుల ఆర్తనాదం

**కోటనందూరు, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ :** "మేము ఎరుకుల కులంలో పుట్టడమే నేరమా..? మా పిల్లల భవిష్యత్తు కోసం కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వండి సార్.." మండుటెండలో చిన్నారులతో తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేస్తూ తాహసిల్దార్ కార్యాలయం వద్ద ఎరుకుల సామాజిక వర్గ కుటుంబాలు తమ నిరసన తెలియజేశాయి. శుక్రవారం కాకినాడ జిల్లా తుని తాహసిల్దార్ కార్యాలయం వద్ద పట్నంలో రామకృష్ణ కాలనీకి చెందిన ఎరుకుల సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు తమ పిల్లల భవిష్యత్తును కాపాడేందుకు అధికారులు చొరవ చూపాలని, చదువుకునే అవకాశం కల్పించేందుకు కుల దృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర నాయకుడు జనార్ధన్ ఆధ్వర్యంలో తాహసిల్దార్ కార్యాలయం వద్ద తమ నిరసన తెలియజేశారు. సందర్భంగా మాట్లాడుతూ ఎరుకుల సామాజిక వర్గ కుటుంబాలు కుల ధ్రువీకరణ పత్రాల కోసం గత కొన్ని నెలలుగా అధికారులను ఆశ్రయిస్తున్నామని తెలిపారు. అధికారులు కోరిన మైగ్రేషన్ సర్టిఫికెట్, ఫోటోలు, ఇతర పత్రాలను సమర్పించినప్పటికీ వివిధ కారణాలతో దరఖాస్తులు తిరస్కరిస్తున్నారని తల్లిదండ్రులు, చిన్నారులు ఆవేదన వ్యక్తం చేశారు.కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ పిల్లల చదువుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని




తల్లిదండ్రులు తెలిపారు. పాఠశాల విద్య, ప్రభుత్వ పథకాలు, ఇతర విద్యా అవసరాలకు ధ్రువీకరణ పత్రాలు అవసరమవుతున్నాయని పేర్కొన్నారు.ఈ క్రమంలో చిన్నారులు నేరుగా "డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సార్.. జిల్లా కలెక్టర్ సార్.. మాకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇప్పించండి.. మా చదువులు ఆగిపోకుండా చూడండి" అంటూ విజ్ఞప్తి చేశారు. మండుటెండలో చిన్నారులు పదేపదే "కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వండి సార్" అంటూ నినదించడం అక్కడున్న వారిని కలచివేసింది. తాము సంచార జాతికి చెందిన వారమైనప్పటికీ తుని పారిశ్రామిక ప్రాంతంలో సుమారు 15 నుంచి 20 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నామని కుటుంబాలు పేర్కొన్నాయి. తమ సమస్యను అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యపై ప్రభుత్వం, జిల్లా అధికారులు వెంటనే స్పందించి అర్హతలను పరిశీలించి కుల ధ్రువీకరణ పత్రాల సమస్యను పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకుడు జనార్ధన్ కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ సమస్యను తక్షణమే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.



# కేప్‌టౌన్‌లో భారత స్వరం

## సదస్సులో ఎంపీ డాక్టర్ దగ్గుబాటి పురందేశ్వరి ప్రత్యేక భాగస్వామ్యం

రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రపంచవ్యాప్తంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లు, అవకాశాలపై విస్తృత చర్చకు వేదికగా నిలిచిన 69వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సులో భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందం చురుకైన పాత్ర పోషించింది. ఈ అంతర్జాతీయ సమావేశంలో భారత ప్రతినిధి బృందంలో లోక్‌సభ సభ్యురాలు డా. దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొన్నారు. ఈ సదస్సులో మారుతున్న ప్రపంచ వ్యవస్థలో అంతర్జాతీయ చట్టం, ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ సహకారం, సమగ్ర అభివృద్ధి వంటి అంశాలపై కామన్వెల్త్ దేశాల ప్రజాప్రతినిధులు చర్చించారు. "ఆక్రమిత కశ్మీర్" గురించి పాకిస్తాన్ చేసిన వ్యాఖ్యలపై పురందరేశ్వరి గట్టిగా స్పందించారు. కశ్మీర్ భారత్‌లో విలీనం కావడం పూర్తిగా చట్టబద్ధమైన ప్రక్రియని. ఎవరెన్ని మాటలు చెప్పినా, ఎలాంటి వాదనలు చేసినా ఈ వాస్తవాన్ని మార్చలేరని కశ్మీర్ నుంచి ఎవరైనా వైదొలగాల్సి ఉంటే, అక్రమంగా ఆ ప్రాంతాన్ని ఆక్రమించిన పాకిస్తానే అక్కడి నుంచి వెళ్లాలని స్పష్టం చేశారు. భారత ప్రతినిధి బృందంలో డా. పురందేశ్వరికి లభించిన ముఖ్యమైన బాధ్యతల్లో కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సిపిఎ) ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో పాల్గొనడం ఒకటి. ఈ సమావేశంలో కామన్వెల్త్ పార్లమెంటరీ వ్యవస్థకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చ జరుగుతుండగా, డా. పురందేశ్వరి భారతదేశ అభిప్రాయాలు, దృక్పథాలను సమర్థవంతంగా వినిపించారు. భారత పార్లమెంటరీ అనుభవం, ప్రజాస్వామ్య విలువలు, శాసన వ్యవస్థల మధ్య సహకారం వంటి అంశాల్లో భారత దృక్పథానికి ఆమె ప్రాతినిధ్యం వహించారు. ఈ విషయాన్ని భారత పార్లమెంట్‌కు చెందిన అధికారిక సమాచార విడుదల కూడా స్పష్టం చేసింది.

**మహిళా పార్లమెంటేరియన్ల సమావేశంలో కీలక భాగస్వామ్యం**

69వ సదస్సులో భాగంగా జరిగిన 10వ కామన్వెల్త్ ఉమెన్ పార్లమెంటేరియన్స్ (సిడబ్ల్యూపి) కాన్ఫరెన్స్‌లో కూడా డా. పురందేశ్వరి పాల్గొన్నారు. మహిళలకు రాజకీయ, శాసన రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడం, పార్లమెంటరీ విధానాల్లో లింగ సమానత్వాన్ని ప్రతిబింబించడం, ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత విస్తరించడం వంటి అంశాలు ఈ సమావేశాల్లో ప్రధానంగా చర్చకు వచ్చాయి. డా. పురందేశ్వరి ఈ అంతర్జాతీయ వేదికపై జరిగిన ప్యానెల్ చర్చలో పాల్గొన్నారు. పార్లమెంటరీ ప్రక్రియలు, విధానాలు, చట్టాల రూపకల్పనలో లింగ సమానత్వ దృక్పథాన్ని ఎలా అంతర్భాగం చేయాలనే అంశం ఈ చర్చకు కేంద్రంగా ఉంది. "అందరికీ చట్టం" -చర్చకు కేంద్రబిందువు అనే అంశం కేవలం మహిళలకు సంబంధించినది మాత్రమే కాకుండా, శాసన ప్రక్రియలో



సమాజంలోని వివిధ వర్గాల అవసరాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని ముందుకు తెచ్చింది. చట్టాల రూపకల్పన నుంచి పార్లమెంటరీ కమిటీల పరిశీలన, సభా చర్చలు, చట్టాల అమలు అనంతర సమీక్ష వరకు ప్రతి దశలో సమానత్వ దృష్టిని అనుసరించడం ఎలా సాధ్యమనే అంశంపై ఈ వర్క్‌షాప్ దృష్టి సారించింది. ఈ చర్చలో డా. పురందేశ్వరి పాల్గొనడం ద్వారా భారత పార్లమెంటరీ అనుభవానికి అంతర్జాతీయ వేదికపై ప్రాతినిధ్యం లభించింది. కామన్వెల్త్ మహిళా పార్లమెంటేరియన్లలో భారత ప్రాంతీయ ప్రతినిధిగా డా. పురందేశ్వరి ప్రస్తుతం ఉన్నారు. సిపిఎ అధికారిక వివరాల ప్రకారం ఆమె సిడబ్ల్యూపి అంతర్జాతీయ స్టీరింగ్ కమిటీలో భారత ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించారు. అందువల్ల కేప్‌టౌన్ సమావేశాల్లో ఆమె పాల్గొనడం సాధారణ ప్రతినిధి హాజరుకే పరిమితం కాకుండా, కామన్వెల్త్ మహిళా పార్లమెంటేరియన్ల అంతర్జాతీయ వేదికలో భారత దృక్పథాన్ని ప్రతిబింబించే పాత్రగా నిలిచింది. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందంలో డా. పురందేశ్వరితో పాటు పలువురు లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, రాజ్యసభ సెక్రటరీ జనరల్ పాల్గొన్నారు. భారత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభలకు చెందిన 32 మంది ప్రిసైడింగ్ అధికారులు, 18 మంది కార్యదర్శులు కూడా ఈ సదస్సులో పాల్గొన్నారు. భారత ప్రతినిధి బృందం పాల్గొన్న అంశాల్లో సమగ్ర వాణిజ్యం, అసమానతలు, అభివృద్ధి, వికలాంగులకు అందుబాటులో ఉండే పార్లమెంట్లు, మహిళా సమానత్వం, వాతావరణ మార్పులకు అనుగుణంగా చర్యలు, కృత్రిమ మేధస్సు, మానవ హక్కులు, శాంతి వంటి సమకాలీన అంశాలు ఉన్నాయి. మహిళా సాధికారత నుంచి సమగ్ర ప్రజాస్వామ్యం వరకు డా. పురందేశ్వరి కేప్‌టౌన్ భాగస్వామ్యంలో ప్రత్యేకంగా కనిపించే అంశం మహిళా సాధికారతను పార్లమెంటరీ చట్ట నిర్మాణంతో అనుసంధానించడం. పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యం పెరగడం ఒక అంశమైతే, చట్టాల రూపకల్పనలో మహిళల అవసరాలు, సమానత్వం, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రతిబింబించడం మరో ముఖ్యమైన అంశం. "లెజిస్లేటింగ్ ఫర్ ఆల్" చర్చ ఈ విస్తృత దృక్పథానికే వేదికగా నిలిచింది. ఇలాంటి అంతర్జాతీయ వేదికపై భారతదేశం తరఫున డా. పురందేశ్వరి పాల్గొని, సిపిఎ ఎగ్జిక్యూటివ్ కమిటీతో పాటు మహిళా పార్లమెంటేరియన్ల సమావేశంలోనూ తన పాత్రను నిర్వహించడం భారత పార్లమెంటరీ దౌత్యంలో ఒక ముఖ్యమైన భాగంగా నిలిచింది. 69వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సు చర్చలు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికల ప్రక్రియతో ముగిసిపోదు. ప్రజలందరికీ సమాన ప్రాతినిధ్యం, సమగ్ర చట్టాలు, బాధ్యతాయుతమైన పార్లమెంటరీ వ్యవస్థ, అంతర్జాతీయ సహకారం, మానవ హక్కుల పరిరక్షణ వంటి అంశాలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయి. ఈ విస్తృత చర్చలో భారతదేశం తరఫున డా. దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొని, ముఖ్యంగా మహిళా సమానత్వం, సమగ్ర శాసన ప్రక్రియ, పార్లమెంటరీ సహకారం వంటి అంశాల్లో భారత దృక్పథాన్ని అంతర్జాతీయ వేదికపై ప్రతిబింబించారు. 1947లో స్వాతంత్ర్యం పొందిన నాటి నుంచే మహిళలకు సమాన ఓటు హక్కు, సమానత్వాన్ని కల్పించిన భారతదేశం నేడు 'మహిళల అభివృద్ధి' నుంచి 'మహిళల నేతృత్వంలోని అభివృద్ధి' వైపు పయనిస్తోందన్నారు. 73వ, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల్లో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడం నుంచి నారీ శక్తి వందన్ అధినియమం ద్వారా పార్లమెంట్, శాసనసభల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంపొందించే దిశగా భారత్ చారిత్రాత్మక అడుగులు వేస్తోందన్నారు. స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్, ఉజ్వల, ముద్రా, స్టాండ్ అప్ ఇండియా, స్వయం సహాయక సంఘాల వంటి కార్యక్రమాల ద్వారా మహిళల ఆరోగ్యం, గౌరవం, విద్య, ఆర్థిక స్వావలంబన మహిళా నాయకత్వాన్ని బలోపేతం చేస్తున్నదని వివరించారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా, దేశ నిర్మాణంలో క్రియాశీల భాగస్వాములుగా, నిర్ణయాధికారులుగా, నాయకులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే సమాజం, దేశం మరింత న్యాయబద్ధంగా, సమానంగా, సమృద్ధిగా అభివృద్ధి చెందుతుందని ఈ వేదికపై పురందరేశ్వరి వివరించారు. కేప్‌టౌన్ వేదికగా సాగిన ఈ సదస్సులో భారత పార్లమెంటరీ స్వరం ప్రపంచ ప్రజాస్వామ్య సంభాషణలో భాగమవుతుండగా, డా. పురందేశ్వరి భాగస్వామ్యం మహిళా పార్లమెంటేరియన్ల అంతర్జాతీయ చర్చల్లో భారత ప్రతినిధిత్వానికి ప్రత్యేక ప్రాధాన్యతను తీసుకొచ్చింది.

# 10 లీటర్ల నాటు సారాతో వ్యక్తి అరెస్ట్

## 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్



రాయవరం, సెప్టెంబర్ 18, విశ్వంవాయిస్ న్యూస్ : నాటు సారా అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఓ వ్యక్తి పట్టుబడినట్లు ఎస్సై సురేష్ బాబు తెలిపారు. ఒయన తెలిపిన వివరాల ప్రకారం రాయవరం మండలం నరాలవారిపాలెం, పసలపూడి గ్రామ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో వాసంశెట్టి రామచంద్రరావు వద్ద 10 లీటర్ల నాటు సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. నాటు సారాతో పట్టుబడిన రామచంద్రరావును పోలీసులు అరెస్ట్ చేసి, చట్టపరమైన ప్రక్రియ అనంతరం అనపర్తి జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచగా, కేసును పరిశీలించిన గౌరవ న్యాయస్థానం నిందితుడికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు రాయవరం ఎస్సై డి. సురేష్ బాబు తెలిపారు.

# రైతులకు ఉద్యాన శాఖ రాయితీ సదుపాయాలు



సీతానగరం, సెప్టెంబర్ 18, విశ్వంవాయిస్ న్యూస్ : ఉద్యాన శాఖ ద్వారా రైతులకు పలు పథకాల కింద రాయితీలు అందుబాటులో ఉన్నాయని ఉద్యాన శాఖ అధికారి పి.రిని తెలిపారు.

**ఆయిల్‌పామ్:** మొక్కలు ఉచితంగా అందజేయడం తో పాటు మొదటి 4 సంవత్సరా లకు ఎరువులు/ఇన్‌పుట్స్ కోసం హెక్టారుకు రూ.5,250/ల రాయితీ.కూరగాయలు: సొంత మరి యు కౌలు రైతులకు హెక్టా రుకు రూ.3,000 ల వరకు, గరిష్టంగా 2 హెక్టార్లకు.

**పందిరి కూరగాయలు:** వెదురు కర్రలు, వైర్, విత్తనాల బిల్లు లతో హెక్టారుకు రూ.24,000 ల వరకు.ఫార్మ్ పాండ్: .ఫార్మ్ పాండ్ (నీటి కుంట):పొలంలో 20 ఐ 20 ఐ 3 మీటర్ల పరిమాణంలో నీటి కుంటను తవ్వి, ప్లాస్టిక్ షీట్‌తో లైనింగ్ చేసినట్లయితే వర్షపు నీటిని నిల్వ చేసుకొని వర్షాభావ పరిస్థితుల్లో పంటలకు వినియోగించుకో వచ్చు. నిర్దేశిత స్పెసిఫికేషన్ల ప్రకారం ఫార్మ్ సౌండ్ నిర్మిం చుకున్న అర్హత కలిగిన రైతుల కు రూ.90,000 ల వరకు రాయితీ అందించడం జరుగు తుంది.పనస, డ్రాగన్ ఫ్రూట్ వంటి వైవిధ్య ఉద్యాన పంటలకు హెక్టారుకు రూ.1,62,000 ల వరకు రాయితీ అందించడం జరుగుతుంది. సిమెంట్ స్తంభాలు, ఐరన్ వైర్‌తో పందిరి: ఎకరానికి రూ.1,00,000 ల వరకు రాయితీ.ఈ పథకాలుఈ చెదురుమదురుగా కాకుండా గ్రామాల వారీగా క్లస్టర్ విధానంలో అమలు చేయబడ తాయి. సొంత మరియు కౌలు రైతులు ఈ అవకాశాలను వినియోగించుకోవచ్చు.కౌలు కార్డు తప్పని సరిమరిన్ని వివరాలకు మీ సమీప ఆర్ఎస్‌కే సహాయకుడిని సంప్రదించాలని ఉద్యానశాఖాది కారి పి. రిని తెలిపారు.

# ఘనంగా విశ్వకర్మ భగవాన్ పూజ మహోత్సవం



సీతానగరం, సెప్టెంబర్ 18, విశ్వంవాయిస్ న్యూస్ : స్థానిక పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం నందు గురువారం విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా యర్రోజు శ్రీనివాస్ సీతామహాలక్ష్మి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు బలగా వీరభద్రం మాట్లాడుతూ, ప్రతీ సంవత్సరం సెప్టెంబరు17 వతారీకున విశ్వకర్మ జయంతి నిర్వహిస్తామని తెలిపారు. చరిత్రలో విశ్వకర్మ భగవాన్ కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. శిల్పులు, ఇంజనీర్లు, ఐటీ నిపుణులు, కార్మికులు, అన్ని చేతివృత్తుల వారు పూజలు నిర్వహిస్తారని ఈసందర్భంగా తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ,వర్షాలు సమృద్ధిగా పడి రైతులు ,రైతు కూలీలు, ప్రజలంతా ఆనందంగా వుండాలని పూజలు నిర్వహించడంజరిగిందని వెల్లడించారు. జయంతి సందర్భంగా వాహనదారులు, ప్రజలకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ వైఎస్ ప్రెసిడెంట్ చీరాల శ్రీనివాస్,సూరవరపు సత్యనారాయణ, బలగాశ్రీను ,గంగుల రామబ్రహ్మం, అనుపోతు తారకరాము ,వంగలపూడి నాగేంద్ర, మునపర్తి సూరిబాబు, కలవచర్ల వాసు ,అత్తిలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మెరిట్ విద్యార్థులకు ప్రశంస



రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 18, విశ్వంవాయిస్ న్యూస్ : స్థానిక సాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు నున్న ప్రశాంతి గారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గత శుక్రవారం జిల్లా స్థాయిలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో ద్వితీయ స్థానాన్ని సాధించిన విద్యార్థులు 10 వ తరగతి విద్యార్థి ఎమ్ అజయ్, 9వ తరగతి చదువుతున్న ఎస్ హర్ష,8వ తరగతి విద్యార్థి పి.చరణ్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ డి.రాముడు , జె శ్రీనివాస్, ఎస్ వరప్రసాద్, కె. బాపిరాజు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మహిళలకు అండగా వన్ స్టాప్ సెంటర్ల పాత్ర కీలకం

## బాధితులకు సత్వర న్యాయం, సమగ్ర సేవలు అందించడమే లక్ష్యం

## విధులు-బాధ్యతలు, నిర్దేశిత మార్గదర్శకాలపై సిబ్బందికి ప్రత్యేక అవగాహన : చైర్ పర్సన్ రాయపాటి శైలజ

రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 18, విశ్వం వాయిస్ న్యూస్ : మహిళలకు అన్యాయం జరిగినప్పుడు వారికి అండగా నిలిచి, బాధితులకు సత్వర న్యాయం, అవసరమైన సహా యాన్ని అందించడంలో వన్ స్టాప్ సెంటర్ల (ఓ.ఎస్.సి) పాత్ర అత్యంత కీలకమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు.శుక్రవారం రాజమహేం ద్రవరం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి లోని మాతృ శిశు విభాగంలో ఏర్పాటు చేసిన వన్ స్టాప్ సెంటర్ల సిబ్బంది అవగాహన కార్యక్రమానికి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం పాత్రికే యులతో సమావేశమై కార్యక్రమం, తన పర్యటన నేపథ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా రాయపాటి శైలజ మాట్లాడుతూ బాధిత మహిళలకు అందించే సేవల్లో నాణ్యత, వేగం మరిం త పెంచే ఉద్దేశంతో వన్ స్టాప్ సెం టర్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ (ఎన్.సి.డబ్ల్యు), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని మహిళలకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా రాజమహేంద్రవరంలో 16 జిల్లాలకు చెందిన వన్ స్టాప్ సెంటర్ల సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు.

**వన్ స్టాప్ సెంటర్ ముఖ్య ఉద్దేశ్యం, విధులు - బాధ్యతలపై అవగాహన**

హింస, వేధింపులు, ఇతర ఇబ్బందులకు గురైన మహిళలకు ఒకే చోట అవసరమైన సహాయం అందించడం వన్ స్టాప్ సెంటర్ల ప్రధాన ఉద్దేశ్యమని చైర్ పర్సన్ రాయపాటి శైలజ వివరించారు.బాధితులకు అందించే లీగల్ కౌన్సిలింగ్, ఎఫ్ఐఆర్ నమోదులో సహాయం, పోలీసు అధికారుల సమక్షంలో కేసుల డాక్యుమెంటేషన్, న్యాయపరమైన అంశాలు తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. విధులు నిర్వహించే క్రమంలో పాటించాల్సిన నిర్దేశిత మార్గదర్శకాలు, సిబ్బంది బాధ్యతలు, బాధితులతో వ్యవహరించాల్సిన విధానం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. వివిధ రకాల కేసులతో నిత్యం పనిచేసే సిబ్బంది మానసిక ఒత్తిడిని అధిగమించేలా సైకియాట్రిస్టులతో ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నట్లు చైర్ పర్సన్ తెలిపారు.ఈ సదస్సులో సిబ్బందికి చట్టపరమైన అంశాలు, బాధిత మహిళలకు సంబంధించిన కేసుల డాక్యుమెంటేషన్ నిర్వహణలో పాటించాల్సిన మెలకువలు, కేసుల నమోదు నుంచి తదుపరి చర్యల వరకు సిబ్బంది నిర్వహించాల్సిన బాధ్యతలు, విధుల నిర్వహణలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన విధానాలపై




సంబంధిత విభాగాల్లో నిపుణులైన వారు సూచనలు, సలహాలు అందించారు. బాధిత మహిళలకు సున్నితమైన రీతిలో సేవలందిస్తూ, వారి గోప్యతను కాపాడటం, కేసులకు సంబంధించిన వివరాలను సమగ్రంగా నమోదు చేయడం, అవసరమైన విభాగాలతో సమన్వయం చేసుకుంటూ సత్వర సహాయం అందించడం వంటి అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

**సోషల్ మీడియా మోసాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలి**

ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న మోసాలు, వేధింపుల పట్ల యువతులు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని రాయపాటి శైలజ సూచించారు. మహిళల భద్రతకు అందుబాటులో ఉన్న 'శక్తి యాప్'ను విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు. పిల్లల సోషల్ మీడియా వినియోగంపై తల్లిదండ్రులు బాధ్యతగా పర్యవేక్షించాలని, పిల్లలలో సోషల్ మీడియా వినియోగంపై అవగాహన, నియంత్రణ ఇంటి నుంచే ప్రారంభం కావాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో కె ఆనంద రావు, డీఎస్పీ ఏ. శివప్రియ, పోలవరం మరియు అల్లూరి జిల్లాల డీఎస్పీలు వేణుగోపాల్ తదితరులు, రాజమహేంద్రవరం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ సోఫియా, రాజమహేంద్రవరం, కాకినాడ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.




# రణబాలి నుంచి క్రేజీ అప్డేట్..

## షూటింగ్ గురించి డైరెక్టర్ పోస్ట్..



ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో మోస్ట్ అవైటెడ్ మూవీ రణబాలి. భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే ఓ రేంజ్ హైప్ నెలకొంది. ఎప్పుడెప్పుడు ఈ మూవీని చూస్తామా అని ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ చిత్రానికి సంబంధించిన వచ్చిన ప్రతి అప్డేట్ క్షణాల్లో వైరలవుతుంది. టాలీవుడ్ మోస్ట్ లవబుల్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ రణబాలి. పెళ్లి తర్వాత వీరిద్దరు కలిసి నటిస్తున్న ఫస్ట్ మూవీ కావడంతో ఈ చిత్రాన్ని చూసేందుకు జనాలు తెగ వెయిట్ చేస్తున్నారు. భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రంపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకున్నాయి. ఈ చిత్రానికి రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇదివరకే ఈ మూవీ నుంచి విడుదలైన ప్రతి చిన్న అప్డేట్ క్షణాల్లో వైరల్ అయ్యాయి. ముఖ్యంగా ఏందయ్యా సామీ సాంగ్ యూట్యూబ్, సోషల్ మీడియాను షేక్ చేసింది. ఇక ఇప్పుడు ఈ మూవీ గురించి డైరెక్టర్ రాహుల్ క్రేజ్ అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమా చిత్రీకరణకు గుమ్మడి కాయ కొట్టినట్లు తెలుపుతూ తన ట్విట్టర్ ఖాతాలో ఓ ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. తన సినిమా టీమ్ మొత్తాన్ని ఒక్కచోటికి చేర్చి "అలుపెరుగని సైన్యం" అంటూ ఆ వీడియోకు క్యాప్షన్ ఇచ్చారు డైరెక్టర్ రాహుల్. భారీ అంచనాల మధ్య ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా లెవల్లో రిలీజ్ చేయనున్నారు. అక్టోబర్ 16న దసరా కానుకగా అడియన్స్ ముందుకు తీసుకురానున్నారు. గీత గోవిందం, డియర్ కామ్రేడ్ వంటి చిత్రాల తర్వాత విజయ్, రష్మిక కాంబోలో వస్తున్న సినిమా ఇది. ఇందులో రష్మిక పాత్రకు జయమ్మ అని తన తల్లి పేరు పెట్టుకున్నట్లు ఇటీవల డైరెక్టర్ రాహుల్ తెలిపారు. "రణబాలి గుండెల్లో ప్రేమగా, ఆత్మలో స్ఫూర్తిగా, వెన్నెముకలో ధైర్యంగా, అతని పిచ్చిలో మాధుర్యంగా జయమ్మ పాత్ర ఉంటుంది" అని అన్నారు. ఈ సినిమాను 19వ శతాబ్దం నేపథ్యంలో 1854-1878 మధ్య కాలంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్నారు.

# మగవాళ్ళకి కూడా పీరియడ్స్ రావాలి..

## శ్రుతిహాసన్ సెన్సేషనల్ కామెంట్స్

సినీ ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అవసరం లేని పేరు శ్రుతి హాసన్. విలక్షణ నటుడు కమల్ హాసన్ కుమార్తెగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఆమె.. నటిగా మాత్రమే కాకుండా సింగర్‌గానూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించింది. సినీ ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అవసరం లేని పేరు శ్రుతి హాసన్. విలక్షణ నటుడు కమల్ హాసన్ కుమార్తెగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఆమె.. నటిగా మాత్రమే కాకుండా సింగర్‌గానూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించింది. అయితే తాజాగా శ్రుతి హాసన్ చేసిన కొన్ని వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా పీరియడ్స్ సమయంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులు, వాటిని బయటకు చెప్పడానికి తాను పడిన ఇబ్బందుల గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. నటి సోహా అలీ ఖాన్ నిర్వహిస్తున్న 'ఆల్ అబౌట్ హర్' పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న శ్రుతి హాసన్.. తన వ్యక్తిగత అనుభవాలను ఓపెన్‌గా పంచుకుంది. తనకు PCOS సమస్య ఉండటంతో పీరియడ్స్ సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని తెలిపింది. చిన్నప్పటి నుంచే పీరియడ్స్ తనకు చాలా బాధాకరంగా ఉండేవని చెప్పిన శ్రుతి.. కొన్ని సందర్భాల్లో విపరీతమైన నొప్పితో పాటు వాంతులు చేసుకోవడం, స్పృహ కోల్పోవడం వంటి పరిస్థితులు కూడా ఎదురయ్యాయని తెలిపింది. కొన్నిసార్లు పరిస్థితి తీవ్రంగా మారడంతో ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేదని తన అనుభవాలను వివరించింది. సినిమాల్లోకి వచ్చిన తర్వాత ఈ సమస్య తనకు మరింత ఇబ్బందికరంగా మారిందని శ్రుతి హాసన్ చెప్పుకొచ్చింది. ముఖ్యంగా షూటింగ్ సమయంలో యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొనేటప్పుడు కడుపునొప్పి తీవ్రంగా ఉన్నప్పటికీ.. ఆ విషయాన్ని ఎవరికీ చెప్పలేక చాలా ఇబ్బంది పడేదానినని తెలిపింది. తనకు ఏదైనా సమస్య ఉందని చెప్పడం కంటే.. దాన్ని దాచుకోవడమే మంచిదని అప్పట్లో భావించేదానినని చెప్పింది. అయితే అలా తన సమస్యను దాచుకోవడం వల్ల తాను ఎందుకు డల్‌గా, ఎనర్జీ లేకుండా కనిపిస్తున్నాననే విషయం చుట్టుపక్కల వారికి అర్థం కాకపోయేదని పేర్కొంది. అయితే ఒకసారి తనతో కలిసి పనిచేస్తున్న ఓ ఆర్టిస్ట్‌కు సర్జరీ జరగడంతో అతని పరిస్థితిని మేకర్స్‌కు వివరించగా.. వారు అతనికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారని శ్రుతి తెలిపింది. అంతేకాదు, అతనికి ఇబ్బంది కలగకుండా షూటింగ్ సమయాలను సైతం మార్చారని చెప్పింది. ఆ సంఘటనను చూసిన తర్వాత తాను కూడా తన సమస్యను మేకర్స్‌కు చెబితే వారు అర్థం చేసుకుంటారనే నమ్మకం కలిగిందని తెలిపింది. ఆ తర్వాత ఓ దర్శకుడికి తన పీరియడ్స్ సమస్య గురించి చెప్పానని, ఆయన ఎంతో సానుకూలంగా స్పందించారని చెప్పుకొచ్చింది. ఆ దర్శకుడికి కూడా కుమార్తె ఉండటంతో తనకు మరింత ధైర్యం వచ్చిందని వెల్లడించింది. అప్పటి నుంచి తన సమస్యను దాచుకోకుండా అవసరమైనప్పుడు ఓపెన్‌గా చెప్పడం ప్రారంభించానని శ్రుతి హాసన్ పేర్కొంది. ఇదే సందర్భంలో శ్రుతి హాసన్ మగవాళ్లపై సరదాగా సెటైరికల్ కామెంట్ చేసింది. మగవాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుంటుందని ఆమె వ్యాఖ్యానించింది. అలా జరిగితే హీరోయిన్లతో కుదుర్చుకునే కాంట్రాక్టుల్లో పీరియడ్స్ విషయాన్ని కూడా ప్రత్యేకంగా ప్రస్తావించి.. వారికి హాలిడేస్ ఇచ్చేవారేమో అంటూ సరదాగా చెప్పింది. ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



క్రీడా వాయిస్
మీ క్రీడా వార్తల స్వరము

# అమ్మాయిల ధమాకా

## నేటి నుంచే మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్




మహిళా యువ క్రికెటర్ల ప్రతిభను వెలికి తీసి, వారిని డబ్ల్యూపీఎల్, భారత జట్టు వైపు నడిపించడమే లక్ష్యంగా ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) ఆరంభించిన మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్)లో తొలి సీజన్‌కు రంగం సిద్ధమైంది. నాలుగు జట్లు తలపడే ఈ టోర్నీ శనివారమే మొదలు కాబోతోంది. 7 రోజుల పాటు 13 మ్యాచ్‌లు జరుగుతాయి. అన్ని మ్యాచ్‌లకూ మంగళగిరిలోని ఏసీఏ స్టేడియమే వేదిక. తొలి రోజు మధ్యాహ్నం 1.30 నుంచి రాయలసీమ జెన్ స్టార్స్, గోదావరి ఈగల్స్ మధ్య ఆరంభ మ్యాచ్ జరుగుతుంది. సాయంత్రం 6 గంటల నుంచి రెండో మ్యాచ్‌లో అమరావతి ఈ ఛాంపియన్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్ తలపడనున్నాయి. ప్రతి జట్టూ లీగ్ దశలో మిగతా మూడు జట్లతో రెండేసి మ్యాచ్‌లు ఆడుతుంది. లీగ్ దశలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఈ నెల 27న ఫైనల్లో తలపడతాయి. మ్యాచ్‌లను జియో హాట్‌స్టార్ ప్రసారం చేయనుంది. ఆరంభ వేడుకలు సాయంత్రం 5 నుంచి: శనివారం సాయంత్రం 5 గంటలకు మొదలయ్యే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి హాజరు కానున్నారు. డబ్ల్యూఏపీఎల్‌కు భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ సారథి మిథాలీరాజ్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తోన్నారు. లీగ్‌లో మ్యాచ్‌లను వీక్షించేందుకు అభిమానులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నారు.

### ఈ ఛాంపియన్స్ జట్టు సమతూకంతో ఈ ఛాంపియన్స్

తెలంగాణ లీగ్ టీజీ20లో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జట్టును దక్కించుకుని తొలి సీజన్లోనే ఛాంపియన్‌గా నిలిపిన ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (రామోజీ గ్రూప్).. డబ్ల్యూఏపీఎల్‌లో అమరావతి ఫ్రాంచైజీని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. 'అమరావతి ఈ ఛాంపియన్స్'గా బరిలో దిగనున్న ఉషోదయ జట్టు.. నీరగట్టు అనూష సారథ్యంలో సమతూకంతో కనిపిస్తోంది. బ్యాటింగ్‌లో ఓపెనర్ రాజ్యలక్ష్మితో పాటు వైస్ కెప్టెన్ కంద్రేగుల దేవిక, వికెట్ కీపర్ బ్యాటర్ కాట్రగడ్డ దీక్ష, మొహంతి శ్రీ ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో అంకం విష్ణుప్రియ, లక్ష్మీప్రసన్న, సాయి పూజిత, దీప్తి, తరుణి జోషి, పి.రంగలక్ష్మి జట్టుకు కీలకం.

# ప్రభుత్వం ఏం చెబితే దాన్నే పాటించాలి : కపిల్ దేవ్



పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ ఆటగాళ్లతో కలిసి భారత క్రికెటర్లు కరచాలనం చేయడంలేదు. ఆ దేశానికి చెందిన ప్రతినిధుల చేతులమీదుగా ట్రోఫీలను కూడా తీసుకోలేదు. గత రెండు ఆసియా కప్పుల్లో ఇలాగే జరిగింది. ఈ క్రమంలో భారత్ - పాక్ జట్ల అంశంపైనా.. మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితులపైనా భారత క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ స్పందించారు. "పాకిస్థాన్ ఆటగాళ్లతో కరచాలనం చేయొద్దని భారత ప్రభుత్వం నిర్ణయిస్తే.. టీమ్ఇండియా క్రికెటర్లకు మరో అవకాశం లేనట్లే. ప్రభుత్వం ఏది చెబితే దానినే పాటించాలి" అని కపిల్ స్పష్టం చేశారు. మహిళల ఆసియా కప్‌ను భారత్ గెలిచిన తర్వాత ట్రోఫీని ఇచ్చేందుకు పాక్ బోర్డు ఛైర్మన్ మోసిన్ నఖ్వీ వచ్చారు. కానీ, భారత్ మాత్రం అతడి నుంచి తీసుకొనేందుకు విముఖత ప్రదర్శించింది.

### ఇమ్రాన్ విషయంలో..

పాకిస్థాన్‌తో ఎంత విరోధం ఉన్నా.. ఆ జట్టు మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ పరిస్థితిపై భారత్‌లోని మాజీలూ పెద్ద ఎత్తున మద్దతుగా నిలిచారు. మరోసారి కపిల్ స్పందిస్తూ.. "ఇమ్రాన్ ఖాన్‌ను కనీసం మానవత్వంతోనైనా పట్టించుకోండి. అతడికి వైద్య సదుపాయం కల్పించాలి. ఇదే మా కనీస డిమాండ్" అని కపిల్ అన్నారు.

# టెక్‌బాల్ 'క్వీన్' డిసౌజా.. చరిత్రకు అడుగు దూరంలో



టెక్‌బాల్.. ఈ గేమ్ భారత్‌కు కాస్త కొత్తే. ఇక్కడ ఇంకా పెద్దగా విస్తరించలేదు. కానీ, ఆసియా గేమ్‌లోనూ పోటీపడే స్థాయికి మన అథ్లెట్లు చేరుకోవడం అభినందనీయమే. ఇక తొలిసారి పతకం సాధించే దిశగా ఓ యువ అథ్లెట్ అడుగులు వేస్తోంది. ఇప్పటికే సెమీస్‌కు చేరుకున్న ఆ యువతి మరొక విజయంతో మెడల్‌ను ఖాయం చేసుకోనుంది. టేబుల్ టెన్నిస్ ం ఫుట్‌బాల్‌ను కలిపి ఆడితే టెక్‌బాల్ అవుతుంది. టీటీ టేబుల్‌పైన చేతులతో కాకుండా మిగతా శరరీంతో ఫుట్‌బాల్‌లా తలపడటమే టెక్‌బాల్. 2017లో తొలిసారి టెక్‌బాల్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ నిర్వహించారు. 2018-19లో భారత్‌లో ప్రవేశించిన ఈ ఆటకు.. ఇప్పుడిప్పుడే ఆదరణ పెరుగుతోంది. భారత్ నుంచి ఈసారి ఆసియా క్రీడల్లో ముగ్గురు బరిలోకి దిగారు. మెన్స్ డబుల్స్‌లో ఓడిపోగా.. మహిళల సింగిల్స్‌లో క్విమ్సి డిసౌజా సెమీస్‌కు చేరి ఆశ్చర్యపరిచింది. శనివారం కూడా గెలిస్తే.. ఫైనల్‌కు చేరుకుంటుంది. అప్పుడు పతకం ఖాయం కానుంది. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ అనాస్ ఇమ్రాన్ బెగ్‌తో కలిసి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది.

### తొలుత ఫుట్‌బాలర్‌గా..

ముంబయిలో జన్మించిన క్విమ్సి డిసౌజా తన కెరీర్‌ను ఫుట్‌బాల్ ప్లేయర్‌గా మొదలుపెట్టింది. మహారాష్ట్ర తరఫున అండర్-19 ఫుట్‌బాల్ మ్యాచులు ఆడింది. అయితే, 2022 నుంచి టెక్‌బాల్ గేమ్‌కు మారిపోయింది. కేవలం నాలుగేళ్ల వ్యవధిలోనే ఆసియా గేమ్స్‌లో తలపడేంత స్థాయికి ఎదిగింది. ఫుట్‌బాల్ ఆటలో అనుభవం ఉండటం ఆమెకు కలిసొచ్చింది. ఏడుసార్లు జాతీయ ఛాంపియన్‌గా అవతరించింది. భారత్‌లో టెక్‌బాల్ విస్తరణలో కీలక పాత్ర పోషించే బెంగళూరు క్లబ్‌తో కలిసి పని చేసింది. మరోవైపు డెకాథ్లాన్‌లో టెస్ట్ ఇంజినీర్‌గానూ బాధ్యతలు నిర్వర్తించనుండటం గమనార్హం.

### 24వ ర్యాంకుకు..

ఇటీవల రొమేనియాలో జరిగిన వరల్డ్ ఛాంపియన్‌షిప్‌ను క్విమ్సి 9వ స్థానంతో ముగించింది. ఈ క్రమంలో కెరీర్‌లోనే అత్యుత్తమ 24వ ర్యాంకును సాధించింది. ఇప్పుడు ఆసియా గేమ్స్‌లోనూ పతకం కైవసం చేసుకుంటే.. టెక్‌బాల్‌కు ఇంకాస్త ప్రచారం వచ్చినట్లే. అదే సమయంలో ఈ గేమ్‌లో భారత్‌కు పతకం సాధించిన తొలి అథ్లెట్‌గానూ క్విమ్సి చరిత్రలో నిలిచిపోతుంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com